MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 314 | పేజీలు : 8 | మంగళవారం 3 నవంబర్ 2026 | వెల : 6-00



దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు
సుప్రీంకోర్టు ఓకే!

- నవంబర్ 7, 8 తేదీల్లోనే అనుమతి.. రోజుకు రెండు గంటలు మాత్రమే
- ఉదయం 6-7 గంటలు.. రాత్రి 8-10 గంటల వరకు అవకాశం
- ఆస్పత్రులు, విద్యాసంస్థల పరిసరాల్లో 300 మీటర్ల వరకు నిషేధం
- నవంబర్ 9 నుంచి మళ్లీ పూర్తి స్థాయి నిషేధం

5



భారత వైమానిక దళానికి
కొత్త అధిపతి

- 29వ చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్
- ఎయిర్ చీఫ్ మార్షల్‌గా బాధ్యతల స్వీకరణ
- ఏపీ సింగ్ స్థానంలో నియామకం
- నాలుగు దశాబ్దాల సైనిక సేవ.. 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం
- ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

నేడే.. కౌంటింగ్



తుది అంకానికి పుర పోరు

- ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్
- ఐదు జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- 138 కేంద్రాలు.. 556 కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు
- 6,831 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు
- ఫలితాలపై అధికార, విపక్షాల్లో ఉత్కంఠ

అమరావతి, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. నవంబరు 1న జరిగిన పోలింగ్‌లో వివాదాలు, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు వచ్చిన 13 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో ఎన్నికల సంఘం దృష్టి ఇప్పుడు ఓట్ల లెక్కింపుపై కేంద్రీకృతమైంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగాలు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశాయి. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. నవంబరు 1న జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో బూత్ కబ్జా, రిగ్గింగ్ వంటి ఆరోపణలు రావడంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ 13 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు అనంతపురం, తిరుపతి, వైఎస్సార్ కడప, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని ఏడు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 12 వార్డులకు సంబంధించిన 13 కేంద్రాల్లో సోమవారం తిరిగి పోలింగ్ నిర్వహించారు. - మిగతా 2లో




బీజేపీ ప్రచారం బూమరాంగ్.. దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!

- ఇండియా కూటమి ర్యాలీతో వ్యాపారాలకు నష్టం లేదన్న కాంగ్రెస్
- దుకాణాలు తెరిచే ఉన్నాయి.. కొనసాగిన కొనుగోళ్లు
- బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టారు: జైరాం రమేశ్
- స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని రాహుల్ పిలుపు

5

ప్రతి మండలంలో కూటమి
జెండా ఎగరాలి

- స్థానిక ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం
- 28 జెడ్పీ చైర్మన్ స్థానాలే లక్ష్యం
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సమష్టి వ్యూహం
- కూటమి పార్టీల మధ్య పూర్తి సమన్వయం ఉండాలి
- ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ
- కౌంటింగ్ వేళ అప్రమత్తంగా ఉండాలని సూచన



అమరావతి, మహానగర్

రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా సోమవారం కూటమి పార్టీల ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీల మధ్య సమన్వయం, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు కూటమి పార్టీల ముఖ్యనేతలు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో - మిగతా 2లో

రాప్తాడు బాలికపై దాడి..
ప్రభుత్వ వైఫల్యమే కారణం

- బెంగళూరులో బాధితురాలికి పరామర్శ
- వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- బాలిక కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి
- వైద్యం ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలి
- గంజాయి, మద్యం విక్రయాలపై నియంత్రణ ఏదని ప్రశ్న



బెంగళూరు/అమరావతి, మహానగర్

అనంతపురం జిల్లా రాప్తాడులో పాఠశాల బాలికపై జరిగిన దాడి ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. రాష్ట్రంలో మత్తుపదార్థాల వినియోగం, గంజాయి విక్రయాలు పెరిగిపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పాఠశాలల్లోనూ విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను జగన్ పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా: రాప్తాడులోని జిల్లా పరిషత్ ఉన్నత - మిగతా 2లో



రోడ్డు పనుల్లో పెను విషాదం

- విద్యుదాఘాతంతో 8 మంది కార్మికులు మృతి!
- 11 వేల వోల్టుల విద్యుత్ తీగలకు తగిలిన నిర్మాణ యంత్రం
- రాజస్థాన్‌లోని ఝుంఝునూ జిల్లాలో ఘోర ప్రమాదం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

5

విపత్తుల వేళ రైతుకు బీమా భరోసా

- నష్టపరిహారం త్వరగా అందించాలి: చంద్రబాబు
- ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారం
- రైతులు, కౌలురైతులకు నష్టం జరగకుండా చర్యలు
- తుపాన్లతో పంట నష్టంపై తక్షణ అంచనాలు
- కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి
- 'మురసు' తుపాను ఎదుర్కొనేందుకు యంత్రాంగం అప్రమత్తం

2లో



కూటమి విజయానికి సమన్వయంతో పనిచేయాలి

సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ పుల్లమ్మకు జడ్పీటీసీ టికెట్

ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు రూరల్, విస్సన్నపేట మండలాల్లో ఎంపీ కేశినేని చిన్ని పర్యటన

ఐవీఆర్ఎస్ సర్వేలో పుల్లమ్మకు 64 శాతం మద్దతు వచ్చిందని వెల్లడి

ఎమ్మెల్యే, ఎంపీ మధ్య అభిప్రాయ భేదాలు సహజం.. పార్టీ నిర్ణయమే ముఖ్యం

కూటమిలో సమన్వయానికి ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టీకరణ

తిరువూరు, మహానగర్

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఏ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు రూరల్, విస్సన్నపేట మండలాల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా మండలాల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులతో సమావేశమై ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలని కార్యకర్తలకు





పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంపలగూడెం జడ్పీటీసీ అభ్యర్థిగా పుల్లమ్మకు టికెట్ కేటాయించడంపై ఎంపీ మీడియాతో మాట్లాడుతూ సామాజిక న్యాయం, పార్టీ పట్ల అంకితభావం, ప్రజాదరణకు ప్రాధాన్యత ఇచ్చి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన పుల్లమ్మ కుటుంబ సేవలను గుర్తించి అధిష్ఠానం అవకాశం కల్పించిందన్నారు. ఉద్యోగాన్ని సైతం వదులుకుని పార్టీ కోసం పనిచేసిన వారి అంకితభావాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. టికెట్ కోసం పలువురు పోటీపడినప్పటికీ స్థానిక నాయకులు త్యాగం చేసి పుల్లమ్మకు అవకాశం కల్పించారని వివరించారు. అభ్యర్థి ఎంపిక కోసం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో పుల్లమ్మకు 64 శాతం మద్దతు లభించిందని వెల్లడించారు. పార్టీ పట్ల అంకితభావం, ప్రజాదరణ, క్షేత్రస్థాయి నాయకుల అభిప్రాయాలు, సర్వే ఫలితాల ఆధారంగానే టికెట్లు కేటాయించామని తెలిపారు. ఎమ్మెల్యేకు చెక్ పెట్టేందుకే పుల్లమ్మకు జడ్పీటీసీ టికెట్ ఇచ్చారన్న ప్రచారంపై స్పందిస్తూ ఎమ్మెల్యే, ఎంపీ మధ్య చిన్నచిన్న అభిప్రాయ భేదాలు సహజమని, వాటిని పెద్దవిగా చూడాల్సిన అవసరం లేదన్నారు. వ్యక్తుల కంటే పార్టీ ప్రయోజనాలు, అధిష్ఠానం నిర్ణయమే ముఖ్యమని, ఎన్నికల సమయంలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తారని స్పష్టం చేశారు. లోకేశ్ నాయకత్వంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయానికి ఎలాంటి ఇబ్బందులు లేవని, అన్ని పార్టీల నాయకులు పరస్పర సహకారంతో ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్నారని తెలిపారు. నాలుగు మండలాల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

విపత్తుల వేళ రైతుకు బీమా భరోసా

అమరావతి

ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారం కూడా అందేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పంట నష్టం జరిగినప్పుడు అంచనాలు రూపొందించడం నుంచి బీమా క్లెయిమ్‌ల పరిష్కారం వరకు ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పంటల బీమా కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విపత్తుల సమయంలో రైతులకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. దీనికి పంటల బీమా పరిహారం కూడా తోడైతే రైతులకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.

బీమా ప్రయోజనాలు అందరికీ చేరాలి

రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది పెద్దఎత్తున రైతులు పంటల బీమా చేయించుకున్నారని చెప్పారు. అయితే బీమా చేయించుకోవడమే కాకుండా, నష్టం జరిగినప్పుడు క్లెయిమ్ ప్రక్రియ సక్రమంగా పూర్తయ్యేలా చూడటం కూడా ముఖ్యమన్నారు. బీమా క్లెయిమ్‌ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన పత్రాలు, నష్టాన్ని నమోదు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్లు చొరవ చూపాలి

పంట నష్టం అంచనాలు, బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, బీమా కంపెనీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతులు, కౌలురైతులు అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ బీమా ప్రయోజనం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తుల సమయంలో పరిహారం కోసం రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని, ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

బీమాపై రైతుల్లో అవగాహన పెంచాలి

పంటల బీమా అనేది రైతుల వ్యవసాయ ప్రణాళికలో భాగం కావాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. బీమా వల్ల ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు కలిగే ఆర్థిక నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి సీజన్‌లో పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని, అర్హతలు, నమోదు గడువులు, క్లెయిమ్ విధానం గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు.

అర్నబ్ తుపానుతో పంట నష్టం

అర్నబ్ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు సీఎం తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నష్టపోయిన పంటలను గుర్తించి త్వరితగతిన అంచనాలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, నష్టం వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు అందాల్సిన ప్రభుత్వ సాయం, బీమా పరిహారం ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

'మురసు' తుపానుపై అప్రమత్తం

మరోవైపు 'మురసు' తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని చంద్రబాబు ఆదేశించారు. అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి అధికారులు, జిల్లా కలెక్టర్లతో తుపాను సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సీఎం సూచించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. పంట నష్టం జరిగిన వెంటనే వివరాలు సేకరించి పరిహార ప్రక్రియకు అవసరమైన చర్యలు చేపట్టాలని చంద్రబాబు సూచించారు.

రాప్తాడు బాలికపై దాడి.. ప్రభుత్వ వైఫల్యమే కారణం

-మొదటిపేజీ తరువాయి

పాఠశాలలో ఓ వ్యక్తి రంపంతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రికి వెళ్లిన జగన్ వైద్యులతో మాట్లాడి బాలికకు అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి, కోలుకునే అవకాశాలపై ఆరా తీశారు. అనంతరం బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రంపం వంటి ప్రమాదకరమైన ఆయుధంతో ఓ వ్యక్తి పాఠశాలలోకి ప్రవేశించి బాలికలపై దాడి చేయడం ఆందోళనకరమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. గ్రామాలు, వీధుల్లో గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు విస్తరించాయని ఆరోపించారు. మత్తుపదార్థాలు యువతకు, పిల్లలకు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయని విమర్శించారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు ప్రవేశించకుండా భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలి:

బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలని జగన్ డిమాండ్ చేశారు. బాధితురాలి వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందకపోతే వైఎస్సార్‌సీపీ తరపున వైద్య సహాయం అందిస్తామని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం పరిహారం అందించకపోయినా, వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తే బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు అందిస్తామని చెప్పారు. బాధిత బాలిక చిన్నాన్న వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి, మండల కన్వీనర్‌గా ఉన్నారని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఆరోపిస్తూ, గత 15--16 నెలల్లో ఇలాంటి ఘటనలు తొమ్మిది చోటుచేసుకున్నాయని వ్యాఖ్యానించారు. గ్రామాల్లో మద్యం, గంజాయి విక్రయాలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వ స్పందనను కథనంలో చేర్చాల్సి ఉంది. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు సానుకూలంగా స్పందించారని జగన్ తెలిపారు. దేవుడి దయతో బాలిక త్వరగా కోలుకుంటుందని వైద్యులు చెప్పడం కొంత ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. బాలికకు మెరుగైన వైద్యం అందించాలని, కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించాలని మరోసారి ప్రభుత్వాన్ని కోరారు.

ఎన్నికల అక్రమాలపై కోర్టుకెళ్తాం.. ఎస్ఈసీ తీరుపై జగన్ ధ్వజం

తాడేపల్లి

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సింది పోయి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తొత్తుగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా పులివెందులలో జరిగిన ఘటనలు ఎన్నికల సంఘం పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాలపై న్యాయపోరాటం కొనసాగిస్తామని, ఆలస్యమైనా చివరకు న్యాయం, ధర్మమే గెలుస్తాయని స్పష్టం చేశారు.

70 బూత్‌లలో అక్రమాలు జరిగాయంటూ..

పులివెందులలో మొత్తం 80 పోలింగ్ బూత్‌లు ఉండగా, 70 చోట్ల వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు పోలీసుల, ఎన్నికల అధికారుల సహకారంతో తమ పార్టీ ఏజెంట్లపై దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. కొన్నిచోట్ల ఏజెంట్లను బలవంతంగా పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించారని పేర్కొన్నారు. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కోవడం, బూత్‌లను ఆక్రమించడం, రిగ్గింగ్, సైక్లింగ్‌కు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు.

రీపోలింగ్‌పై అభ్యంతరం

70 పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు చేసినప్పటికీ, ఎన్నికల సంఘం కేవలం నాలుగు బూత్‌లలో మాత్రమే రీపోలింగ్‌కు ఆదేశించడంపై జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పార్టీ ఏజెంట్లు నేరుగా తన సమక్షంలోనే అధికారులకు ఫిర్యాదులు చేశారని, ఏజెంట్ ఫారాలను చూపిస్తూ నిరసన తెలిపారని గుర్తుచేశారు. ఇన్ని ఘటనలు జరిగినా ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలు కంటితుడుపుగా ఉన్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగాయని ఎలా చెప్పగలమని ప్రశ్నించారు.

రాష్ట్రవ్యాప్తంగా అక్రమాలు జరిగాయని ఆరోపణ

పులివెందులకే పరిమితం కాకుండా కడప, అనంతపురం, తిరుపతి, కర్నూలు, చిత్తూరు, ఒంగోలు, గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్లతో పాటు మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ, జమ్మలమడుగు, నంద్యాల, చీమకుర్తి, గిద్దలూరు, ఎమ్మిగనూరు, సూళ్లూరుపేట, పలాస, డోన్, నాయుడుపేట, నందిగామ, జగ్గయ్యపేట, కుప్పం, పుత్తూరు, పార్వతీపురం తదితర ప్రాంతాల్లోనూ ఎన్నికల అక్రమాలు చోటుచేసుకున్నాయని జగన్ ఆరోపించారు.

నేడే.. కౌంటింగ్

-మొదటిపేజీ తరువాయి

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన రీపోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, పోలీసులు పర్యవేక్షణ చేపట్టారు. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు, పల్నాడు జిల్లాలోని మాచర్ల వంటి కీలక ప్రాంతాల్లో రీపోలింగ్ జరగడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

కౌంటింగ్‌కు భారీ ఏర్పాట్లు

రీపోలింగ్ పూర్తవడంతో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 నగరపాలక సంస్థల కోసం 22, మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కోసం 116 కలిపి మొత్తం 138 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 556 కౌంటింగ్ హాళ్లు, 6,831 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులను నియమించడంతో పాటు అవసరమైన అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

ముందుగా పోస్టల్ బ్యాలెట్లు

మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన అనంతరం బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వార్డుల వారీగా ఓట్లను వేరు చేసి, అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. ప్రతి రౌండ్ పూర్తయిన తర్వాత సంబంధిత వివరాలను నమోదు చేసి, అధికారిక ప్రక్రియ ప్రకారం ఫలితాలను ప్రకటించనున్నారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశారు.

కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత:

కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలతో నిఘా ఉంచనున్నారు. గుర్తింపు కార్డులు కలిగిన అభ్యర్థుల ఏజెంట్లను మాత్రమే నిబంధనల ప్రకారం కౌంటింగ్ హాళ్లలోకి అనుమతించనున్నారు. అనుమతి లేని వ్యక్తులు కేంద్రాల పరిసరాల్లోకి రాకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు.

60.96 శాతం పోలింగ్ నమోదు:

నవంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా 92 పట్టణ స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో సుమారు 60.96 శాతం పోలింగ్ నమోదైంది. 13 మేయర్ పదవులు, 70 మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులతో పాటు కార్పొరేషన్లలో 804 డివిజన్లు, మున్సిపాలిటీల్లో 2,382 వార్డులకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రీపోలింగ్ జరిగిన కేంద్రాల్లో నమోదైన ఓట్లతో కలిపి అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది.

కూటమి, వైఎస్సార్‌సీపీకి కీలకం:

రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఈ ఫలితాలకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. అధికార కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ప్రజల మద్దతు ఎవరికి లభించిందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మేయర్, చైర్‌పర్సన్ పదవులతో పాటు డివిజన్లు, వార్డుల వారీగా గెలుపోటములపై ఉత్కంఠ కొనసాగుతోంది. మంగళవారం వెలువడనున్న ఫలితాలతో పట్టణ స్థానిక సంస్థల్లో ఎవరి ఆధిపత్యం ఎంతన్నది స్పష్టం కానుంది.

ప్రతి మండలంలో కూటమి జెండా ఎగరాలి

-మొదటిపేజీ తరువాయి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలనూ కూటమి కైవసం చేసుకోవాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం జెడ్పీటీసీ స్థానాల్లో అత్యధిక విజయాలు సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రతి మండలంలోనూ కూటమి బలాన్ని చాటాలని, ఎంపీటీసీ స్థానాల్లోనూ పైచేయి సాధించాలని స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించామని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఎన్నికల్లో కూటమికి మరింత మద్దతు లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

కూటమి పార్టీల మధ్య సమన్వయం ముఖ్యం

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తికి అనుగుణంగా ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలోనూ మూడు పార్టీల నాయకులు ఒకే మాటపై నిలబడి, ఉమ్మడి లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయంతో వ్యవహరించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు.

పోలింగ్ శాతం పెంచాలి:

ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదవడంపై చంద్రబాబు ప్రస్తావించారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూటమికి మద్దతుగా ఉన్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఓటర్లకు ఎన్నికల తేదీలు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియజేస్తూ చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల రోజున ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చేలా క్షేత్రస్థాయిలో కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు.

పులివెందుల ఘటనపై నేతలకు అభినందనలు: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. పులివెందులలో హింసాత్మక ఘటనలకు కొందరు ప్రయత్నించినప్పటికీ కూటమి నాయకులు సంయమనం పాటించారని అభినందించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. త్వరలో జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలోనూ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ పరిణామాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ఒకవైపు ఎన్నికల సన్నాహాలు కొనసాగుతుండగా, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ప్రభుత్వం సమర్థంగా చేపడుతోందని చంద్రబాబు తెలిపారు. తుపానుల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ చేపట్టి, విద్యుత్ సరఫరాను తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం, ఓటర్ల సమీకరణ, పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియపై కూటమి పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి.

వెలగలేరు రెగ్యులేటర్ పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో ఏర్పాటు

ప్రజల భద్రతే లక్ష్యంగా ముందస్తు అప్రమత్తత చర్యలు

నీటిమట్టం, వరద ప్రవాహ పరిస్థితుల నిరంతర పరిశీలన

బృందాలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ దిశానిర్దేశం



విజయవాడ, మహానగర్

మురసు తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పాటు, ఎగువ ప్రాంతాల నుంచి వెలగలేరు రెగ్యులేటర్‌కు భారీగా వరద నీరు చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రత్యేక ముందస్తు అప్రమత్తత చర్యలు చేపట్టారు. రెగ్యులేటర్ వద్ద నీటిమట్టం అకస్మాత్తుగా పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సమీప గ్రామాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సంయుక్త పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మూడు రోజుల పాటు షిఫ్టుల వారీగా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఎప్పటికప్పుడు రెగ్యులేటర్ వద్ద నీటిమట్టం, వరద నీటి ప్రవాహ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటిమట్టంలో పెరుగుదల, తగ్గుదలతో పాటు వరద ప్రవాహంలో చోటుచేసుకునే మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు. నీటిమట్టం అకస్మాత్తుగా పెరిగినా, అసాధారణ రీతిలో వరద ప్రవాహం ఉన్నా వెంటనే తహసీల్దార్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు నీటిమట్టాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం, నీటి విడుదలకు సంబంధించిన సాంకేతిక సమాచారాన్ని పర్యవేక్షణ బృందానికి అందించాలన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలు, ముంపు ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను అవసరమైన సందర్భాల్లో ముందుగానే అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పర్యవేక్షణ బృందం వెలగలేరు రెగ్యులేటర్ వద్దే అందుబాటులో ఉండి నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని, తుపాను ప్రభావం దృష్ట్యా అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

మాజీ డీజీపీ ఎన్. బాలసుబ్రహ్మణ్యానికి ఘన నివాళి

ముఖ్యమంత్రి చంద్రబాబు, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పలువురు ప్రముఖుల శ్రద్ధాంజలి

పోలీస్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



విజయవాడ, మహానగర్

హఠాత్తుగా మరణించిన మాజీ డీజీపీ ఎన్. బాలసుబ్రహ్మణ్యంకు సోమవారం ఘనంగా నివాళులర్పించి, భవానీపురం శ్మశానవాటికలో పూర్తి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఉదయం సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై బాలసుబ్రహ్మణ్యం భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. పోలీస్ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా ఏఎస్పీ, ఎస్పీ, ఇంటెలిజెన్స్, రవాణా శాఖ తదితర కీలక విభాగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర డీజీపీలు, ఏడీజీపీలు, పోలీస్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, రిటైర్డ్ పోలీస్ అధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్ నుంచి భవానీపురం శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అక్కడ పోలీస్ శాఖ తరఫున గౌరవ వందనం సమర్పించి, పూర్తి పోలీస్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

వలలో చిక్కుకుని ఊపిరాడక మృతి చెందినట్లు సమాచారం

ఉల్లిపాలెంలో విషాదఛాయలు.. కుటుంబ సభ్యుల రోదనలు

ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదేహం తరలింపు





అవనిగడ్డ, మహానగర్

జీవనోపాధి కోసం చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు కృష్ణానదిలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ మాణిక్యాలరావు ఆదివారం దక్షిణ చిరువోలులంకలో తన పెదనాన్న కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం మరో ఐదుగురితో కలిసి చేపల వేట కోసం కృష్ణానదిలోకి వెళ్లారు. వేట కొనసాగుతున్న సమయంలో నదిలో ఏర్పాటు చేసిన వలలో మాణిక్యాలరావు ప్రమాదవశాత్తు చిక్కుకున్నారు. వల నుంచి బయటపడేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాకపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిసింది. ఆరుగురు కలిసి వేటకు వెళ్లగా మాణిక్యాలరావు ప్రాణాలు కోల్పోవడంతో తోటి మత్స్యకారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆయన మృతితో కన్నీరుమున్నీరయ్యారు. సోమవారం ఉదయం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామమైన ఉల్లిపాలెంకు తరలించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న మాణిక్యాలరావు అకాల మరణంతో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఈ ఘటనతో ఉల్లిపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు

ఆంధ్రా లయోలా కళాశాలలో కౌంటింగ్‌కు విస్తృత ఏర్పాట్లు

తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు మూడు ప్రత్యేక కౌంటింగ్ హాళ్లు

ప్రతి వార్డుకు 10 టేబుళ్ల చొప్పున ఓట్ల లెక్కింపు

విజయవాడ, మహానగర్

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది ఉదయం 6 గంటలకే ఆంధ్రా లయోలా కళాశాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ముందుగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలించి, ఎన్నికల నిబంధనల ప్రకారం లెక్కింపు చేపట్టనున్నారు. ఇందుకోసం తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా మూడు కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశారు. తూర్పు నియోజకవర్గ వార్డుల ఓట్ల లెక్కింపు ఇండోర్ స్టేడియంలో, పశ్చిమ నియోజకవర్గ వార్డుల కౌంటింగ్ ఇంటర్మీడియట్ బ్లాక్‌లో, సెంట్రల్ నియోజకవర్గ వార్డుల ఓట్ల లెక్కింపు ఇంటర్మీడియట్ బ్లాక్‌కు ఎదురుగా ఉన్న మరో బ్లాక్‌లో నిర్వహించనున్నారు. ప్రతి వార్డుకు 10 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. వీటిలో ఐదు టేబుళ్లపై వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు, మరో ఐదు టేబుళ్లపై మేయర్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో వార్డు ఫలితాన్ని ప్రకటించేందుకు రెండు రౌండ్ల కౌంటింగ్ అవసరమవుతుంది. మొదటి రెండు రౌండ్లలో 44 వార్డుల ఫలితాలు ప్రకటించనుండగా, తదుపరి రెండు రౌండ్లలో మిగిలిన వార్డుల ఫలితాలను వెల్లడించనున్నారు. వార్డుల కౌంటింగ్ పూర్తయిన తర్వాత మేయర్ అభ్యర్థులకు సంబంధించిన మిగిలిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

మురసు తుఫాను నేపథ్యంలో నేడు అన్ని విద్యాసంస్థలకు సెలవు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

మురసు తుఫాను ప్రభావంతో మంగళవారం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు నవంబర్ 3వ తేదీన సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యాసంస్థలు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఆదేశాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి గడపకు వెళ్లి ఓటర్ల మద్దతు పొందాలి

కూటమి అభ్యర్థులకు మంత్రి కొలుసు పార్థసారథి పిలుపు

సమన్వయంతో పనిచేసి ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచన



విజయవాడ, మహానగర్

ఎన్నికల ప్రచార గడువు ముగిసే సమయానికి ప్రతి గడపకు వెళ్లి, ప్రతి ఓటరును కలిసి మద్దతు పొందాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కూటమి అభ్యర్థులకు సూచించారు. సోమవారం సాయంత్రం, మండల కేంద్రంలో కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార రథం నుంచి మాట్లాడుతూ ప్రచారానికి సమయం తక్కువగా ఉన్నందున పంతాలు, పట్టింపులకు పోకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలతో మమేకమై పనిచేసే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని సూచించారు. నూజివీడు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులందరికీ ప్రజలు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు, కూటమి పార్టీల నాయకులు, మండల, గ్రామస్థాయి ప్రముఖులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణకు 'మురసు' గండం..

మూడు రోజుల పాటు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తుపాను తీవ్రత దృష్ట్యా సోమవారానికి ఆరెంజ్, మంగళవారానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగాలు సిద్ధంగా ఉండాలని సూచించింది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం, ప్రస్తుతం నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న మురసు తుపాను, సోమవారం ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా బలపడనుంది. ఇది నవంబర్ 2వ తేదీ అర్ధరాత్రి నుంచి 3వ తేదీ తెల్లవారుజాము మధ్యలో దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు–నర్సాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు.ఈ తుఫాను ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురువనున్నాయి. సోమవారం (నవంబర్ 2) ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు ఐఎండీ తెలిపింది.మంగళవారం (నవంబర్ 3) ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున రెడ్ అలర్ట్ ప్రకటించారు. అదే సమయంలో భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు.

విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు

స్థానిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు, మద్దతుదారులకు పోలీసుల హెచ్చరిక

బాణసంచా కాల్చడం, డీజేలు, అధిక శబ్దంతో మైక్ సెట్ల వినియోగంపై నిషేధం

నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన క్రిమినల్ కేసులు

ప్రశాంత వాతావరణం కొనసాగించేందుకు సహకరించాలని సీపీ రాజశేఖరబాబు విజ్ఞప్తి



విజయవాడ, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు మంగళవారం విడుదల కానున్న నేపథ్యంలో విజయం సాధించిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు హెచ్చరించారు. డప్పు వాయిద్యాలతో ప్రదర్శనలు నిర్వహించడం, బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా కాల్చడం, అధిక శబ్దంతో కూడిన మైక్ సెట్లు, డీజేలు వినియోగించడం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్, పోలీస్ యాక్ట్‌లోని సెక్షన్ 30 అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ర్యాలీలు నిర్వహించినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ఇతర వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించినా సంబంధిత వ్యక్తులపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరస్పర శాంతి, సామరస్యాలను పాటించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

బుడమేరు పరివాహక ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. అపోహలను నమ్మవద్దు

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో ముంచుకొస్తున్న 'మురసు' తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. బుడమేరు క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ నివేదికల దృష్ట్యా, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సోమవారం సాయంత్రం బుడమేరు పరివాహక ప్రాంతంలోని గూడవల్లి, ఎనికేపాడు ప్రాంతాలలలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా బుడమేరు ప్రవాహ తీరును, గట్లను, క్షేత్రస్థాయి పరిస్థితులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరినా ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు కలగకుండా తూములు, వంతెనల వద్ద గుర్రపుడెక్క, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. బలహీనంగా ఉన్న కరకట్టల వద్ద ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గేంతవరకు బుడమేరు లోతట్టు, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార యంత్రాంగం రౌండ్ ది క్లాక్ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని మాత్రమే గమనించాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అపోహలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసర సమాచారం ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్.9154970454కు సమాచారం అందించాలని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ బి.సుగుణ, ఇరిగేషన్ డిఈ కె.బాబు, జెఈ రాజశేఖర్, తదితరులు ఉన్నారు

ఓవర్ టు హస్తిన!

ఢిల్లీలో రాజకీయ వాతావరణం హీటెక్కింది. బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ నిరసనలకు తెరతీసి నగర వీధులు దద్దరిల్లేలా చేశాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సారథ్యంలోని ఇండి కూటమి పార్టీలు ఓట్ చోరీ మార్చ్ నిర్వహించాయి. మరోవైపు, కాంగ్రెస్‌ను టార్గెట్ చేసేందుకు బీజేపీ 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల సంస్మరణార్థంగా మరో ర్యాలీకి నిర్వహించింది.కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సారథ్యంలో ఇండి కూటమి పార్టీలు ఛలో ఢిల్లీ ర్యాలీలో పాల్గొన్నాయి. రామ్‌లీలా మైదానం వరకూ నిర్వహించాయి. నారీ నగర్ బస్‌స్టాప్ నుంచి తిలక్ నగర్ వరకూ బీజేపీ ర్యాలీ నిర్వహించింది. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల కోసం ఉద్దేశించిన రోజున కాంగ్రెస్ తన పొలిటల్ ప్రోగ్రామ్ ప్రారంభించిందని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది.ప్రతిపక్షాల మార్చ్ మధ్యాహ్నం మింటో రోడ్-కాన్నాట్ ప్లేస్ ప్రాంతంలో ప్రారంభమైంది. సర్ కారణంగా ఓటర్ల జాబితాలో తలెత్తిన లోపాలను సవరించడంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గే, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు తాము ఉద్యమాన్ని చేపట్టినట్టు కాంగ్రెస్ ప్రకటించింది. ఎన్నికల సంఘం పనితీరుపై కూడా పలు ప్రశ్నలు సంధించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని పేర్కొంది.1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా పశ్చిమ ఢిల్లీలోని హరీనగర్ బస్‌స్టాప్ నుంచి తిలక్‌నగర్ మెట్రోస్టేషన్ వరకూ బీజేపీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పార్టీలోని ఇతర పెద్దలూ పాల్గొన్నారు. సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా కార్యక్రమాలు జరుగుతున్న రోజే కాంగ్రెస్ మరో నిరసన కార్యక్రమానికి తెరతీయడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.పోటాపోటీ నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. రామ్‌లీలా మైదానంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయడంతో పాటు డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిఘా పెంచారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో పారామిలిటరీ సిబ్బంది కూడా పాలుపంచుకున్నారు.జంతర్ మంతర్ వేదికగా సాగిన కాక్రోచ్ ఉద్యమంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించగలిగారు. దానికి కారణం వారి పోరాటంలో ఉన్న స్వచ్ఛమైన ప్రజా ప్రయోజనం, బాధిత వర్గాల ప్రత్యక్ష భాగస్వామ్యం. సమస్య తీవ్రత నేరుగాలక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల భవిష్యత్తుకు సంబంధించినది కావడంతో ఆ ఆందోళనలు ప్రభుత్వానికి చుట్టుముట్టి తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి వైదొలగాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ వేదికగా చేపట్టిన ర్యాలీలతో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి దింపగలదా అన్న ప్రశ్నకు సానుకూల సమాధానం రావడం లేదు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, 13 కోట్ల అర్హుల ఓట్లను అక్రమంగా తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తున్నప్పటికీ.. ఆ అంశాన్ని క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల తిరుగుబాటుగా మలచడంలో పార్టీ ఘోరంగా విఫలమైంది. తమ ఓటు హక్కు నిజంగానే ప్రమాదంలో పడిందన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుని ఉంటే, అది స్వచ్ఛంద ప్రజా ఉద్యమంగా మారి సీఈసీపై తీవ్రమైన నైతిక ఒత్తిడి పెరిగేది. కానీ, కాంగ్రెస్ నాయకత్వం ఈ అంశాన్ని ఒక సాంకేతిక రాజకీయ వివాదంగానే ఉంచి, సాధారణ ఓటరును చైతన్యవంతం చేయలేకపోయింది. ఫలితంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవకపోవడంతో రాహుల్ పోరాటానికి బలం రాలేదు.ప్రజల మద్దతు కొరవడటంతో.. దేశ రాజధానిలో నిర్వహిస్తున్న ర్యాలీలు, సభలు పూర్తిగా కాంగ్రెస్, ఇండియా కూటమి శ్రేణుల సమీకరణకే పరిమితమైపోతున్నాయి. ఎన్నికల సంఘం వంటి అత్యున్నత రాజ్యాంగబద్ధ వ్యవస్థపై రాజకీయ పార్టీ కార్యకర్తలతో మాత్రమే పోరాటం నడిపించినప్పుడు, అది సాధారణ ప్రజల దృష్టిలో ఎన్నికల ఓటమికి సాకులు వెతుక్కునే ఎత్తుగడ గానే కనిపిస్తుంది తప్ప నిజమైన ప్రజాస్వామ్య రక్షణ ఉద్యమంగా తోచదు. ఏ ఉద్యమమైనా వ్యవస్థలను ప్రభావితం చేయాలంటే అందులో సామాన్య పౌరుల ఆవేదన కనిపించాలి; కానీ కేవలం పార్టీ జెండాలు, నాయకుల ప్రసంగాలకే పరిమితమైన నిరసనల వల్ల కాంగ్రెస్‌కు రాజకీయంగా రావాల్సిన మైలేజీ రాకపోగా, రాజ్యాంగ వ్యవస్థలను అస్థిరపరుస్తున్నారనే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.ఈ పోరాటంలో సాధారణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాహుల్ గాంధీ పదే పదే పిలుపునిస్తున్నప్పటికీ, సమాజం నుంచి వస్తున్న స్పందన మాత్రం తీవ్ర సందేహాస్పదంగానే ఉంది. ప్రజా ఉద్యమాలకు, రాజకీయ ప్రదర్శనలకు తేడా ఉంటుందన్న ప్రాథమిక నిజాన్ని కాంగ్రెస్ నాయకత్వం విస్మరిస్తోంది. ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి రాని పక్షంలో, ఎన్ని ఢిల్లీ ర్యాలీలు నిర్వహించినా, ఎన్నిసార్లు రాంలీలా మైదాన్‌లో గళమెత్తినా సీఈసీని రాజీనామా చేయించడం , ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గించడం అసాధ్యం. ప్రజా సమస్యలను రాజకీయాలుగా కాకుండా, రాజకీయాలను ప్రజా ఉద్యమాలుగా మార్చడంలో విఫలమవుతున్నంత కాలం కాంగ్రెస్ చేసే పోరాటాలు అరణ్యరోదనగానే మిగిలిపోక తప్పదు.

చమురు రంగంలో తెలుగు సంస్థలు



దేశ సరిహద్దులకు ఆవల ప్రపంచవ్యాప్తంగా భారత వాణిజ్య విజయం అంటే సహజంగా ఐటీ రంగ దిగ్గజ సంస్థలే గుర్తుకు వస్తాయి. ఈ సంస్థలు సకాలంలో మెరుగైన సేవలు అందించి లాభాలు ఆర్జిస్తున్నాయి; భారత యువజనులకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నాయి; మరీ ముఖ్యంగా భారతీయుల ప్రతిభా పాటవాలకు అంతర్జాతీయంగా ఎనలేని గుర్తింపును సాధిస్తున్నాయి. ఈ కారణంగానే సమకాలీన భారతీయ వాణిజ్య విజయాలకు ఐటీ సంస్థలు ప్రతీకలుగా వెలుగొందుతున్నాయి. ఇటీవల కొంతకాలంగా ఐటీ సంస్థలకు అదనంగా భారతీయ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల సంస్థలూ విదేశాలలో విజయవంతంగా విస్తరిస్తున్నాయి. ఇది శుభ పరిణామం. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రపంచంలో అగ్రభాగాన నిలిచే చమురు నిక్షేపాల నెలవులు అయిన గల్ఫ్ అరబ్బు దేశాలలో ఈ సంస్థలు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి.

వాస్తవానికి భారతీయ ఇంజినీరింగ్, నిర్మాణ రంగ సంస్థలకు అరబ్బు దేశాలు కొత్త కాదు. చమురు ఎగుమతి ఆరంభ కాలం (1970వ దశకం)లో టాటా గ్రూప్ భాగస్వామి అయిన అగ్రగామి కాంట్రాక్టింగ్ కంపెనీ 'షాపూర్జీ పల్లోంజీ' గల్ఫ్ దేశాలలో సివిల్ నిర్మాణాలను విరివిగా చేపట్టింది. ఈ ఎడారి దేశాలలో మట్టి సరిగ్గా అందుబాటులో ఉండదు. దీంతో అవసరమైన మట్టిని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ భారతదేశం నుంచి నౌకలలో తీసుకువచ్చేది. అప్పుడే ఆ కంపెనీ యువ ఇంజినీరు ఎ.పి.జితేందర్ రెడ్డిని కూడా ఉద్యోగ వీసాపై గల్ఫ్‌కు తీసుకువచ్చింది. సుదీర్ఘకాలం అరబ్బు దేశాలలో ఉన్న జితేందర్ దేశానికి తిరిగి వెళ్లి పార్లమెంటుకు పోటీ చేసి ఎన్నికయ్యారు. ఎలక్ట్రో--మెకానికల్ రంగంలో ప్రముఖ భారతీయ సంస్థ 'ఎల్ అండ్ టీ' పూర్తి చేసిన 65 బిలియన్ డాలర్ల విలువైన పనులలో దాదాపు సగం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్ దేశాలకు చెందినవే కావడం విశేషం. ఎడారి ఉష్ణోగ్రతలో ఎయిర్ కండిషన్ ఇంజినీరింగ్ భారీ కాంట్రాక్టులను ప్రపంచ దిగ్గజ బహుళజాతి సంస్థలతో పోటీపడి ఎల్ అండ్ టీ విజయవంతంగా పూర్తిచేసింది. మారుమూల ఇసుక ఎడారుల గుండా హైవోల్టేజీ విద్యుత్ లైన్ల నిర్మాణంలో కూడా ఎల్ అండ్ టీ తన విశిష్టతను చాటింది. గల్ఫ్ దేశాలలో పైపులైను వ్యవస్థ అత్యంత కీలకమైనది. నీటి వనరులు లేని ఈ ఎడారి దేశాలలో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరం నుంచి శుద్ధి చేసిన ఉప్పు నీటిని నగరాలకు సరఫరా చేయడం, చమురును నౌకాశ్రయాల వరకు రవాణా చేయడానికి పైపులు ప్రధాన ఆధారాలు. ఈ పైపుల నిర్మాణం, సరఫరా పనుల్లో భారతీయ సంస్థలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చమురు పైపుల నిర్మాణం, నిర్వహణలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నిపుణులు పెట్టింది పేరు.

గల్ఫ్ దేశాలు అంటే చమురు, గ్యాస్‌కు మారుపేరు. ఈ దేశాలలో ప్రతి వ్యవస్థ ఈ రంగంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుసంధానమై ఉంటుంది. నిరంతర విస్తరణ, నిర్వహణ పనులు ఉండే ఈ రంగంలో ఇప్పటి వరకు భారతీయ సంస్థలు ఏవీ కూడా పోటీపడలేదు. సాధారణంగా అమెరికా, జర్మనీ, బ్రిటన్ దేశాల ఇంజినీరింగ్ సంస్థలే ఇందులో సదా అగ్రగాములుగా ఉంటాయి.

ప్రప్రథమంగా భారతీయ సంస్థలు అందునా తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలు చమురు రంగంలో సాహసోపేతంగా అడుగుపెడుతున్నాయి. చమురు ఉత్పాదకతలో విడుదలయ్యే వివిధ రసాయనాలను వేరు చేస్తూ నికర చమురును తీయడం ఒక ముఖ్య ప్రక్రియ. ఇందుకు అవసరమైన ప్లాంట్లను సాధారణంగా పాశ్చాత్య దేశాల సంస్థలు మాత్రమే నిర్మిస్తాయి. ఈ రకమైన నిర్మాణ పనుల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ సంస్థ కువైత్‌లో దక్కించుకుని ప్రపంచ ఇంజినీరింగ్ సంస్థలను ఆశ్చర్యానికి గురిచేసింది. 381 మిలియన్ డాలర్ల ఈ కాంట్రాక్టు చమురు రంగంలో భారతీయ సంస్థల ప్రాబల్యానికి ఒక తిరుగులేని నిదర్శనం. ఇంతకు ముందూ కువైత్ చమురు సంస్థ నౌకదానిలో 225 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును మేఘా సంస్థే దక్కించుకుంది. సౌదీలో 300 కిలోమీటర్ల పైపు లైను ద్వారా మక్కా పుణ్యక్షేత్రానికి ఐదు లక్షల క్యూసెక్కుల మంచి నీరు సరఫరా చేసే అర్హత పొందిన సంస్థల జాబితాలో కూడా మేఘా ఉన్నది.

తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రోగ్రెసివ్, రాంకీ, జి.యం.ఆర్ సంస్థలు గతంలో వివిధ రంగాలలో కొన్ని పనులు చేసినా కీలకమైన చమురు రంగంలో మేఘా ప్రవేశమే భారతీయ కంపెనీలకు ఒక కొత్త ప్రారంభమని చెప్పవచ్చు. భారత వాణిజ్య విజయాలలో ఇదొక ఉజ్వల అధ్యాయం. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ సంస్థల జైత్రయాత్రను ఇంజినీరింగ్ సంస్థలూ కొనసాగించాలి.

విదేశీ పర్యటనల విధి విధానాలు

సార్వభౌమాధికారం అనేది ఒక దేశానికి తన విదేశీ వ్యవహారాలపై ఉండే సర్వోన్నతమైన, స్వతంత్ర అధికార పర్యవేక్షణ. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలోనైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో మాత్రమే ఉంటుంది. మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం సంస్థానాధీశులు స్వతంత్ర రాజులుగా సర్వాధికారాలు చలాయించినా విదేశీ వ్యవహారాలు బ్రిటన్ పర్యవేక్షణలో ఉండేవి. స్వాతంత్ర్యం సిద్ధించాక అవి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నాయి. కేంద్రం పరిధిలోని విదేశాంగ మంత్రిత్వశాఖ మన దౌత్య విధానాలను అమలుపరుస్తున్నది. విదేశాలకు వెళ్లే సగటు భారతీయుడికి అవసరమైన పాస్‌పోర్టు మొదలు విదేశీ గమ్యస్థానం చేరుకున్న తర్వాత అక్కడ అతడి నడవడిని సైతం మన దౌత్య అధికారులు సదా గమనిస్తుంటారు. విదేశాలలోని మన రాయబారుల కార్యాలయాలు సంబంధిత దేశంలో మన అధికార ప్రముఖుల పర్యటనలను సమన్వయం చేస్తుంటాయి. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు విదేశాంగశాఖ ఆక్షేపణ తెలిపింది. దీంతో రేవంత్ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. బ్రిటన్‌లో పర్యటనను పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగిరావడం ప్రజల్లోను, రాజకీయ వర్గాలలోను చర్చనీయాంశమయింది.

ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రుల అధికారిక విదేశీ పర్యటనలకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం అనేది రాజకీయాలకు అతీతంగా జరిగే సాధారణ ప్రక్రియ. అధికార ప్రముఖుల విదేశీ పర్యటనలను విదేశాంగ విధానానికి అనుగుణంగా సమన్వయపరచడం విదేశీ వ్యవహారాల శాఖ విధి. బహిరంగంగా వెల్లడించలేని విధానానికి విభిన్నంగా పర్యటనలు ఉంటే వాటిని ఆక్షేపించడం, ఆపడం కూడా విదేశాంగశాఖ బాధ్యత. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. తెలుగువాడైన ఒక కేంద్ర మంత్రికి విదేశాల నుంచి ఆహ్వానం ఉన్నా వారి పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. తెలుగువాడైన మరో కేంద్ర మంత్రి విదేశాల్లో ఒక సదస్సుకు వెళ్లేందుకు అనుమతించారు. గతంలో కొందరు ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతి ఇవ్వలేదు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు.. పాకిస్థాన్‌లో సీనియర్ ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇచ్చే అడ్మినిస్ట్రేటివ్ కాలేజీలో ఉపన్యాసం ఇవ్వడంతో పాటు నవాజ్ షరీఫ్ సహా పలువురు రాజకీయ నాయకులను కలవడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2012లో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్.. పాకిస్థాన్ పర్యటనలో జిన్నా సమాధిని సందర్శించేందుకు అనుమతించింది. అయితే 2026లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు ఆక్షేపణ తెలిపింది. ఈ అనుమతి నిరాకరణపై రాజకీయ రాద్ధాంతం చేయకుండా లండన్ నుంచి హుందాగా వెనక్కివచ్చి ఆయన కూడా విజ్ఞత ప్రదర్శించారు. తిరిగి వచ్చిన అనంతరం విలేఖరుల సమావేశంలో ఆచితూచి మాట్లాడారు.

ఒకప్పుడు విధి విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వ అధికారిక బృందాలు పరిమిత సంఖ్యలో విదేశీ పర్యటనలు చేసేవి. ఆ తర్వాత పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెట్టుబడుల కోసం ఉన్నతాధికారులతో సహా విదేశీ పర్యటనలకు వెళ్లడం ప్రారంభమయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడే ఈ తరహా విదేశీ పర్యటనలకు నాంది పలికారు. అవి సాధించిన సత్ఫలితాలకు ఆకర్షితులై గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, ఆ తరువాత ఇతరులు విదేశీ పర్యటనలు చేశారు. పిదప, రాష్ట్రాల మంత్రులు సైతం విదేశీ పర్యటనలు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రుల, రాష్ట్ర మంత్రుల విదేశీ పర్యటనల వ్యయాన్ని రాష్ట్రాలే భరిస్తాయి. అయితే వీటి పట్ల జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విదేశీ వ్యవహారాలశాఖ వ్యవహరిస్తోంది. అది స్వంత ఖర్చుతో వ్యక్తిగత పర్యటన అయినా కూడా విధిగా కేంద్రానికి సమాచారం అందించాలనే నిబంధన ఒకటి ఉన్నది. రాష్ట్రాల నేతలు విదేశీ గడ్డపై తమ రాష్ట్ర రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా మాట్లాడినా, అది జాతీయ విధానానికి భిన్నంగా ఉంటే, దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది కదా. అటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా కేంద్రం జాగ్రత్త వహిస్తుంది. విదేశాలకు వెళ్లినప్పుడు మర్యాద మన్ననలతో వ్యవహరించడం ముఖ్యం. ఏ దేశంలో ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో, ఎవరు ఏ స్థాయిలో ఎవరితో కలవాలి, ఎవరితో కలవకూడదు... అనే విషయమై కేంద్ర, రాష్ట్రాల అధికారిక బృందాలకు విదేశాంగశాఖ మార్గదర్శకం చేస్తుంది. విదేశాలలో ఎవరు అతిథ్యమిస్తున్నారు, ఎవరితో సమావేశమవ్వాలనుకుంటున్నారు ఇత్యాది విషయాలకు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. చివరకు ఎవరైనా బహుమానం ఇస్తే స్వీకరించాలా వద్దా అనేది కూడా రాయబార కార్యాలయం నిర్దేశిస్తుంది. అవతలి వ్యక్తిని బట్టి వస్త్రధారణను సైతం సూచిస్తుంది. భారతీయ అధికార బృందాలు విదేశీ ప్రతినిధులతో సమావేశమైనప్పుడు వారు ఏమేమి మాట్లాడారు, ఏ రకంగా వ్యవహరించారనేది కూడా పక్కన ఉండే భారతీయ దౌత్యవేత్తలు క్షుణ్ణంగా గమనిస్తూ న్యూఢిల్లీకి నివేదిస్తారు. ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణతో విదేశీ పెట్టుబడులు, వలసలకు ప్రాధాన్యం పెరిగిన కాలమిది. భారత నాయకులు ప్రత్యేకించి ప్రతిపక్ష నేతల విదేశీ పర్యటనల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, రాజకీయాలకు అతీతంగా వాటిలో సమాఖ్య స్ఫూర్తి ప్రతిబింబించాలని రేవంత్‌రెడ్డి ఉదంతంలో యూఏఈ మాజీ భారత రాయబారి కె.సి.సింగ్ వ్యాఖ్యానించడం ముదావహం.

ప్రకాశ్ రాజ్‌కు అవకాశాలు తక్కువ

దశాబ్దాలుగా వర్సటైల్ నటుడిగా భారతీయ సినిమాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రకాష్ రాజ్, ఈమధ్య కాలంలో తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా తనకు చిత్ర పరిశ్రమలో అవకాశాలు తగ్గడానికి రాజకీయాలు మాట్లాడటమే కారణమంటూ ఆయన భార్య పోనీ వర్మతో మిడియా ఇంటర్వ్యూల్లో చెప్పిస్తున్నారు.ప్రకాష్ రాజ్ ఈనాటి నుంచి కాదు, కొన్నేళ్లుగా బహిరంగంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. అంతటి తీవ్రమైన రాజకీయ అభిప్రాయాలు వ్యక్తం చేసిన కాలంలోనూ ఆయనను ఇండస్ట్రీ ఆదరించింది, వరుస అవకాశాలు ఇచ్చింది.మరి ఇప్పుడు అవకాశాల గ్రాఫ్ కాస్త తగ్గేసరికి రాజకీయాల వల్లే తనను తొక్కేస్తున్నారంటూ నెపం నెట్టేయడం ఎక్కడి న్యాయమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ఒక నటుడు రాజకీయాల్లోకి వచ్చినంత మాత్రాన సినీ పరిశ్రమ వారిని దూరం పెడుతుందనుకోవడం పూర్తిగా అపోహే. చలనచిత్ర చరిత్రను పరిశీలిస్తే ఎన్టీఆర్, ఎంజీఆర్, కమల్ హాసన్, పవన్ కళ్యాణ్ వరకు ఎంతో మంది నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తూనే సినిమాల్లోనూ రికార్డు విజయాలు సాధించారు. రాజకీయ అభిప్రాయాలు ఉన్న ప్రతి నటుడికి ఇండస్ట్రీ ఎప్పుడూ రెడ్ కార్పెట్ పరచి నెత్తిన పెట్టుకోవాలని కోరుకోవడం కూడా సమంజసం కాదు. వయసు రీత్యా పాత్రల ఎంపిక మారడం, నూతన నటీనటుల రాక, ప్రేక్షకుల అభిరుచుల్లో మార్పుల వల్ల ఎంతో మంది దిగ్గజ నటులకు అవకాశాల తీవ్రత తగ్గుతుంటుంది. కానీ దానికి తమ సొంత రాజకీయ ఎజెండాను జోడించి సానుభూతి పొందే యత్నం చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న వస్తోంది.ఇక రాజకీయంగా పవన్ కళ్యాణ్‌పై నిత్యం ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించే ప్రకాష్ రాజ్, వ్యక్తిగత ప్రాధాన్యతలకు పవన్ కళ్యాణ్ ఇచ్చే గౌరవాన్ని విస్మరిస్తున్నారు. సిద్ధాంత పరంగా విభేదాలు ఉన్నప్పటికీ, ప్రకాష్ రాజ్‌లోని నటుడిని గౌరవిస్తూ పవన్ కళ్యాణ్ తన అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ఓజీ లో ఆయనకు కీలక పాత్ర ఇచ్చారు. రాజకీయాలు వేరు, వృత్తి వేరు అనే ఉదారతను పవన్ కళ్యాణ్ నిరూపించినప్పటికీ.. వార్తల్లో నిలిచేందుకో మళ్లీ పవన్ పైనే నిందలు వేయడం ప్రకాష్ రాజ్ ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా కనిపిస్తోంది.సినీ పరిశ్రమ అనేది కేవలం సృజనాత్మకత, వ్యాపార సూత్రాల ఆధారంగా నడుస్తుంది తప్ప, కేవలం ఒకరి రాజకీయ అభిప్రాయాల ఆధారంగా అవకాశాలను నిలిపివేసేంత చిన్న మనస్తత్వంతో ఉండదు. తనకున్న నటన ప్రతిభతో ఎన్నో అద్భుతమైన పాత్రలను పండించిన ప్రకాష్ రాజ్, స్వీయ విశ్లేషణ చేసుకోకుండా రాజకీయ బాధితుడిని అని కలరింగ్ ఇచ్చుకోవడం ఆయన స్థాయికి తగదని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఒక ఆర్టిస్టుగా ప్రజాదరణ పొందడం వేరు, రాజకీయ లబ్ధి కోసం ఇండస్ట్రీపై బురద చల్లడం వేరనే విషయాన్ని ప్రేక్షకులు కూడా గమనిస్తూనే ఉన్నారు.

సోషల్ మీడియాలో జెన్-జీ బాబా

లక్నో : ఆధ్యాత్మిక గురువులు తమ ప్రవచనాలు, బోధనల ద్వారా గుర్తింపు పొందుతుంటారు. అయితే బృందావన్‌కు చెందిన ఓ గురువు తన యంగ్ లుక్స్‌తో సోషల్ మీడియా స్టార్‌గా మారిపోయారు. ఆయనకు వచ్చిన 'జెన్ జీ బాబా' పేరు నెట్టింట ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. యవ్వనంగా కనిపించే రూపం, స్టైలిష్ లుక్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నా యి.సోషల్ మీడియా పుణ్యమా అని రోజుకో కొత్త వ్యక్తి వెలుగులోకి వస్తున్నారు. కొందరు తమ టాలెంట్‌తో గుర్తింపు తెచ్చుకుంటే.. మరికొందరు ప్రత్యేక వ్యక్తిత్వంతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నారు. తాజాగా బృందావన్‌కు చెందిన శ్రీ శాశ్వత్ ఆచార్య ఆధ్యాత్మిక గురువుగా గుర్తింపు పొందారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'యంగ్ భాగవత కథా వాచక్'గా పరిచయం చేసుకున్నారు. బృందావన్‌లోని శ్రీధామ్ గోదా విహార్ మందిర్‌కు పీఠాధీశ్వరుడిగా వ్యవహరిస్తున్నారు. భాగవత కథలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పడం ఆయన వృత్తి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే మతపరమైన కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటుంటారు.తన సోషల్ మీడియా ఖాతాల్లో ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు పోస్ట్ చేస్తుండటంతో ఫాలోవర్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. అతని యూట్యూబ్ ఛానల్‌లో ఆధ్యాత్మిక ప్రవచనాలు, వివిధ కోర్సులకు సంబంధించిన వీడియోలు అందుబాటులో ఉన్నాయి.సాధారణంగా ఆధ్యాత్మిక గురువులు ప్రవచనాలు, బోధనల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందుతుంటారు. కానీ శాశ్వత్ ఆచార్య విషయంలో మాత్రం పరిస్థితి కాస్త భిన్నంగా ఉంది. యవ్వనంగా కనిపించే రూపం, స్టైలిష్ లుక్స్ నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆయన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు సరదాగా 'జెన్ జీ బాబా' అని పిలవడం ప్రారంభించారు. దీంతో ఆయన పోస్టుల కింద కామెంట్ల వర్షం కురుస్తోంది. శాశ్వత్ ఆచార్య ఫొటోలు, వీడియోలు చూసిన నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఆయనను చూసిన తర్వాత తమకు కూడా ఆధ్యాత్మికతపై ఆసక్తి పెరుగుతోందంటూ కొందరు సరదాగా కామెంట్లు చేస్తున్నారు. చర్మ సౌందర్యం రహస్యమేంటని సరదాగా ప్రశ్నిస్తున్నారు. ఆశీర్వాదాల కోసం వస్తూ ఆకర్షణకు అభిమానులుగా మారిపోతున్నారని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పే యువ గురువు యంగ్ లుక్స్‌తో సోషల్ మీడియా స్టార్‌గా మారిపోయారు.

దీపావళికి గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీంకోర్టు ఓకే!



న్యూఢిల్లీ: దీపావళి పండుగ సందర్భంగా ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో పర్యావరణహిత బాణాసంచా కాల్చేందుకు సుప్రీంకోర్టు పరిమిత అనుమతులు మంజూరు చేసింది. నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే గ్రీన్ క్రాకర్స్ వినియోగించుకోవచ్చని స్పష్టం చేసింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, తిరిగి రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చేందుకు అనుమతించింది. నవంబర్ 9 నుంచి బాణాసంచాపై తిరిగి పూర్తి స్థాయి నిషేధం అమల్లోకి వస్తుందని వెల్లడించింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ఆరోగ్య కేంద్రాలు, సైలెన్స్ జోన్‌లకు 300 మీటర్ల పరిధిలో బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించింది. బేరియం వినియోగించిన టపాసులతో పాటు, గ్రీన్ క్రాకర్స్‌గా ధ్రువీకరణ పొందని బాణాసంచా విక్రయాలను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించింది. హండ్రెడ్ వాలా, థౌజండ్ వాలా వంటి భారీ శబ్దాలు చేసే టపాసుల వినియోగాన్ని కూడా అనుమతించబోమని స్పష్టం చేసింది.

కాలుష్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరం

గతంలో జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అధికారుల మధ్య సమన్వయ లోపమే ఇందుకు ప్రధాన కారణమని అభిప్రాయపడింది. పండుగ సమయంలోనే కాకుండా, ఆ తర్వాత కూడా పర్యావరణ కాలుష్యంపై నిరంతరం సమీక్ష జరగాలని సూచించింది. కేంద్ర, ఢిల్లీ కాలుష్య నియంత్రణ మండళ్ల పర్యవేక్షణ కేంద్రాల నుంచి గాలి నాణ్యత సూచీ వివరాలను సేకరించాలని ఆదేశించింది.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

కాలుష్యం కారణంగా ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య, మరణాల వివరాలను ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల నుంచి సేకరించాలని ధర్మాసనం పేర్కొంది. పటాకుల వల్ల గాలి, శబ్ద కాలుష్యం పెరిగి చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రకృతిలోని పంచభూతాలను పూజించే సంస్కృతి మనదని, ఏ మతాచారమైనా ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని వ్యాఖ్యానించింది.

దియామీర్జా వీడియోపై వివాదం..
తొలగించిన బీఎంసీ

మరోవైపు పర్యావరణహిత దీపావళిపై బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) రూపొందించిన ప్రచార వీడియో వివాదానికి దారితీసింది. సినీనటి దియా మీర్జా నటించిన ఈ వీడియోలో కాలుష్యానికి దూరంగా దీపావళి జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే బీజేపీ నాయకుడు అమిత్ సతమ్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీపావళి ఎలా జరుపుకోవాలో ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో వివాదం చెలరేగడంతో బీఎంసీ తన సోషల్ మీడియా ఖాతాల నుంచి ఆ వీడియోను తొలగించింది. కాలుష్య రహిత దీపావళిపై అవగాహన కల్పించేందుకు బీఎంసీ చేపట్టిన ప్రచారంలో భాగంగానే ఈ వీడియో రూపొందించారు.

భారత వైమానిక దళానికి కొత్త అధిపతి



న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి కొత్త అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దేశానికి 42 ఏళ్లపాటు విశిష్ట సేవలందించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అశుతోష్ దీక్షిత్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. భారత వైమానిక దళానికి అద్భుతమైన నాయకత్వాన్ని అందించగల సమర్థుడైన వాయు యోధుడిగా దీక్షిత్‌ను కొనియాడారు.

స్వదేశీ రక్షణ సామర్థ్యాలకు ప్రాధాన్యం

వైమానిక దళ పోరాట సంసిద్ధతను మరింత బలోపేతం చేయడం, కార్యాచరణ సామర్థ్యాలను పెంపొందించడం, స్వదేశీ రక్షణ రంగాన్ని అభివృద్ధి చేయడం తన ప్రాధాన్యతలని అశుతోష్ దీక్షిత్ స్పష్టం చేశారు. సాంకేతిక ఆవిష్కరణలు, త్రివిధ దళాల మధ్య సమన్వయానికి కూడా ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు.

నాలుగు దశాబ్దాల విశిష్ట సేవలు

నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి అయిన అశుతోష్ దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వైమానిక దళ ఫైటర్ విభాగంలో చేరారు. తన సుదీర్ఘ కెరీర్‌లో కార్యాచరణ, విమాన పరీక్షలు, సామర్థ్యాల అభివృద్ధి, సంయుక్త రక్షణ వ్యవహారాలు వంటి కీలక విభాగాల్లో పనిచేశారు. నిష్ణాతుడైన ఫైటర్ పైలట్‌తో పాటు ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, టెస్ట్ పైలట్‌గా గుర్తింపు పొందారు. మిరాజ్–2000, మిగ్ విమానాల వివిధ రకాలు, జాగ్వార్, రవాణా విమానాలను నడిపిన ఆయనకు 3,300 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది.

వైమానిక దళ ఆధునీకరణలో కీలక పాత్ర

భారత వైమానిక దళ ఆధునీకరణలో దీక్షిత్ కీలక పాత్ర పోషించారు. జాగ్వార్, మిగ్–27 విమానాల ఆధునీకరణ ప్రాజెక్టులతో పాటు స్వదేశీ తేజస్ ఎల్‌సీఏ మార్క్–1 యుద్ధ విమానానికి ప్రారంభ, తుది కార్యాచరణ అనుమతుల ప్రక్రియలో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు. మిరాజ్–2000 స్క్వాడ్రన్, బీదర్ వైమానిక స్థావరం సహా పలు కీలక విభాగాలకు నాయకత్వం వహించారు.

ఆపరేషన్ సింధూర్‌లోనూ కీలక బాధ్యతలు

సదరన్ ఎయిర్ కమాండ్‌లో ఎయిర్ డిఫెన్స్ కమాండర్‌గా, సౌత్ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌లో సీనియర్ ఎయిర్ స్టాఫ్ ఆఫీసర్‌గా పనిచేశారు. డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్, సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్ వంటి కీలక పదవులు చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్‌కు చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా సేవలందించారు. వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా కూడా పనిచేశారు.

పతకాలతో విశిష్ట గుర్తింపు

సైనిక సేవలకు గుర్తింపుగా అశుతోష్ దీక్షిత్‌కు 2026లో పరమ విశిష్ట సేవా పతకం, 2023లో అతి విశిష్ట సేవా పతకం, 2011లో విశిష్ట సేవా పతకం, 2006లో వాయుసేన పతకం లభించాయి. నాలుగు దశాబ్దాల అనుభవంతో ఇప్పుడు దేశ వైమానిక దళానికి నాయకత్వం వహించనున్నారు.

రోడ్డు పనుల్లో పెను విషాదం



ఝుంఝునూ: రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఝుంఝునూ జిల్లాలోని ఉదయ్‌పుర్‌వాటి ప్రాంతం ఛాపోలీ గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డు పనుల్లో ఉపయోగిస్తున్న యంత్రం 11 వేల వోల్టుల సామర్థ్యం కలిగిన విద్యుత్ తీగలకు తగలడంతో ఈ ప్రమాదం సంభవించింది.

యంత్రానికి విద్యుత్ సరఫరా.. కుప్పకూలిన కార్మికులు

గ్రామస్థుల సహకారంతో ఛాపోలీ గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కంకర కలిపేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కదమ్ కుండ్ వైపు వెళ్లే రహదారిపై పనులు జరుగుతుండగా యంత్రం పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఒక్కసారిగా యంత్రంలోకి విద్యుత్ ప్రవహించింది. సమీపంలో పనిచేస్తున్న కార్మికులు విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. ప్రమాద తీవ్రతకు అక్కడివారికి స్పందించే అవకాశం కూడా లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గ్రామస్థులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆస్పత్రులకు తరలించారు.

ఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్

ప్రమాదం గురించి గ్రామస్థులు ఫోన్ ద్వారా సమాచారం అందించారని ఝుంఝునూ జిల్లా కలెక్టర్ అరుణ్ గార్గ్ తెలిపారు. ప్రాథమిక వివరాల ప్రకారం ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించారని వెల్లడించారు. మరో ఆరుగురిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరిందని, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. సమాచారం అందిన వెంటనే తాను ఘటనా స్థలానికి బయలుదేరినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భగవానారామ్ సైనీ, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం

ఈ దుర్ఘటనపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికులు విద్యుదాఘాతంతో మృతి చెందడం హృదయవిదారకమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాధ్యులెవరో తేల్చాలి: అశోక్ గహ్లోత్

మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ సైతం ఈ ఘటనపై స్పందించారు. రోడ్డు నిర్మాణ పనుల సమయంలో ఇంతటి ఘోర ప్రమాదం ఎలా జరిగిందో సమగ్రంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులెవరో గుర్తించాలని అధికారులను కోరారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్ఐఆర్ దెబ్బ..
ఐదు రాష్ట్రాల్లో 2.28 కోట్ల ఓట్లు మాయం!



న్యూఢిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రభావం ఐదు రాష్ట్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, పంజాబ్, మణిపుర్ రాష్ట్రాల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌కు ముందు ఈ ఐదు రాష్ట్రాల్లో కలిపి 18.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, సవరణ అనంతరం ఆ సంఖ్య 16.43 కోట్లకు పడిపోయింది. మొత్తంగా సుమారు 2.28 కోట్ల మంది ఓటర్ల పేర్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

యూపీలో అత్యధికంగా తగ్గిన ఓటర్లు

ఈ ఐదు రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా ఓటర్ల సంఖ్య తగ్గింది. ఎస్ఐఆర్‌కు ముందు 15.44 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య తుది జాబితాలో 13.40 కోట్లకు చేరింది. అంటే సుమారు 2.04 కోట్ల మంది తగ్గారు. మొత్తం ఐదు రాష్ట్రాల్లో నమోదైన తగ్గుదలలో దాదాపు 90 శాతం ఉత్తరప్రదేశ్ నుంచే ఉంది. ఆ రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 13.24 శాతం తగ్గడం గమనార్హం.

అర్హులకు మరో అవకాశం

ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన పౌరులు మరోసారి తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ప్రస్తుతం చేపడుతున్న ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా ఈ అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2027 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువత కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

బీజేపీ ప్రచారం బూమరాంగ్..
దిల్లీలో యథావిధిగా మార్కెట్లు!

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీ రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. ర్యాలీ కారణంగా నగరంలోని వ్యాపారాలు దెబ్బతింటాయని, మార్కెట్లు మూతపడతాయని బీజేపీ చేసిన ప్రచారాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఆదివారం దిల్లీలో దుకాణాలు యథావిధిగా తెరిచి ఉండటంతో పాటు వ్యాపార కార్యకలాపాలు కూడా కొనసాగాయని పేర్కొంది. బీజేపీ చేసిన ప్రచారం బెడిసికొట్టిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

ప్రజలను భయపెట్టే ప్రయత్నం విఫలం

ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు హాజరుకాకుండా అడ్డుకునేందుకు, కార్యక్రమం ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు అధికార పార్టీ ప్రయత్నించిందని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజకీయ కార్యక్రమాల వల్ల వ్యాపారాలకు నష్టం జరుగుతుందన్న ప్రచారం అవాస్తవమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక మార్కెట్లలో కొనుగోళ్లు చేయడం ద్వారా వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చారని తెలిపారు. పెద్ద వ్యాపార సంస్థలతో పాటు చిన్న దుకాణదారులు, వీధి వ్యాపారుల వద్ద కూడా కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు.

ఓటు చోరీ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే..

దేశంలో చర్చనీయాంశంగా మారిన ఓటు చోరీ ఆరోపణలు, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వంటి అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీజేపీ ఈ ప్రచారానికి తెరతీసిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు, ఇండియా కూటమి ర్యాలీకి ప్రజలు రాకుండా నిరుత్సాహపరిచేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమానికి మద్దతు ఇస్తూనే స్థానిక ఆర్థిక వ్యవస్థకు చేయూతనిచ్చిన దిల్లీ ప్రజలు, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక వ్యాపారులకు రాహుల్ పిలుపు

ఇండియా కూటమి ర్యాలీ వల్ల వ్యాపారాలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ ఓ వ్యాపారుల సంఘం రాహుల్ గాంధీకి లేఖ రాసి, ర్యాలీని వాయిదా వేయాలని కోరింది. దీనిపై స్పందించిన రాహుల్ గాంధీ.. దీపావళి సందర్భంగా దిల్లీకి వచ్చిన ప్రజలు స్థానిక వ్యాపారులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం రాత్రి సామాజిక మాధ్యమాల ద్వారా ఈ పిలుపునిచ్చారు. పండుగ కొనుగోళ్లను స్థానిక దుకాణాల్లోనే చేయాలని కోరారు. ర్యాలీ కారణంగా వ్యాపారాలకు ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు.

ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల ప్రశ్నలు

ఆదివారం జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో ప్రతిపక్ష నేతలు బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం బాధ్యతలపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మొత్తంగా ర్యాలీకి ముందు బీజేపీ చేసిన ప్రచారం, అనంతరం కాంగ్రెస్ చేసిన ఎదురుదాడితో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి.

పంజాబ్‌లో ఆప్‌కు భారీ షాక్..
బీజేపీలోకి ముగ్గురు ఎమ్మెల్యేలు!

చండీగఢ్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2027 అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ పార్టీకి చెందిన ముగ్గురు కీలక నేతలు భారతీయ జనతా పార్టీలో చేరారు. మాజీ ఐపీఎస్ అధికారి, అమృత్‌సర్ నార్త్ మాజీ ఎమ్మెల్యే కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్‌తో పాటు హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా, చేతన్ సింగ్ జౌరమాజ్రా సోమవారం బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే ఆప్ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ విమర్శలు చేస్తున్న నేతలు ఒకేసారి పార్టీ మారడం పంజాబ్ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.

పార్టీ నాయకత్వంతో విభేదాలు

హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా పటియాలా జిల్లాలోని సనౌర్ నియోజకవర్గానికి, చేతన్ సింగ్ జౌరమాజ్రా సమానా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఆప్ నాయకత్వం వీరిని సస్పెండ్ చేసింది. అనంతరం ఇద్దరూ పార్టీకి రాజీనామా చేశారు. వారి శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆప్ సిద్ధమైంది. మరోవైపు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ కూడా సోమవారం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను అసెంబ్లీ స్పీకర్‌కు పంపించారు. 2025 జూన్ 29న ఆప్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఆయన అప్పటి నుంచి పార్టీ నాయకత్వం, ప్రభుత్వ విధానాలపై బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

'పంజాబ్ ఫస్ట్'.. విజయ్ ప్రతాప్ స్పష్టం

బీజేపీలో చేరడానికి ముందు కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ ఎక్స్ వేదికగా అమృత్‌సర్ ప్రజలకు సందేశం ఇచ్చారు. తనకు ప్రజలు అందించిన ప్రేమ, గౌరవానికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పంజాబ్ ప్రస్తుతం మాదకద్రవ్యాల సమస్య, గ్యాంగ్‌స్టర్ల బెదిరింపులు, వసూళ్లు, అవినీతితో సతమతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలు, పారదర్శక పాలన అందించేందుకు ప్రజలతో కలిసి పనిచేస్తానని తెలిపారు. తనకు వ్యక్తిగత ప్రయోజనాల కంటే పంజాబ్ అభివృద్ధే ముఖ్యమని, 'పంజాబ్ ఫస్ట్' అనేదే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

జనగామ రైల్వేస్టేషన్‌కు నయా లుక్..

రూ.25 కోట్లతో ఆధునిక హంగులు

వరంగల్ : అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద రూ.25 కోట్లతో జనగామ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం, సాంస్కృతిక చిత్రాలు, విస్తరించిన ప్లాట్‌ఫాంలు, ఏసీ?నాన్ ఏసీ వెయిటింగ్ హాళ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు అందుబాటులోకి వచ్చాయి. అయితే స్టేషన్ ఆవరణలో కోతుల బెడద, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వినియోగంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.తెలంగాణలో రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా జనగామ రైల్వేస్టేషన్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద సుమారు రూ.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సికింద్రాబాద్?కాజీపేట రైలుమార్గంలో కీలకంగా ఉన్న ఈ స్టేషన్ ఇప్పుడు ఆధునిక హంగులు, ఆకర్షణీయమైన నిర్మాణాలు, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలతో కొత్త శోభను సంతరించుకుంది. గతంలో సాధారణ రూపంలో కనిపించిన స్టేషన్ ప్రాంగణం ప్రస్తుతం విశాలమైన ప్రవేశ మార్గాలు, సుందరీకరణ, ఆధునిక వసతులతో ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.స్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు భవన గోడలపై స్థానిక సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక చిత్రాలు రూపొందించారు. ఆలయ గోపురాలను తలపించే నిర్మాణ శైలి స్టేషన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రాంగణంలో విశాలమైన రహదారులు, టైల్స్‌తో నిర్మించిన నడక మార్గాలు, పచ్చిక బయళ్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచేలా సుందరీకరణ పనులు చేపట్టారు. దీంతో స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్లాట్‌ఫాంలను విస్తరించి ఆధునికీకరించారు. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ, నాన్-ఏసీ వెయిటింగ్ హాళ్లను ఆధునిక ఫర్నీచర్‌తో సిద్ధం చేశారు. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు సులభంగా వెళ్లేందుకు గతంలో



ఉన్న పాత వంతెన స్థానంలో విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు లిఫ్టులను అందుబాటులోకి తెచ్చారు. వీటి ద్వారా ప్లాట్‌ఫాంల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయిప్రయాణికులకు సమాచారాన్ని వేగంగా అందించేందుకు డిజిటల్ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. రైళ్ల రాకపోకల వివరాలు స్పష్టంగా వినిపించేలా అనౌన్స్‌మెంట్ వ్యవస్థను మెరుగుపరిచారు. టికెట్ల కొనుగోలు కోసం ఆధునిక బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. స్టేషన్ లోపలి ప్రాంతాలతో పాటు బయట కూడా సుందరీకరణ పనులు చేపట్టడంతో మొత్తం ప్రాంగణం కొత్త రూపును సంతరించుకుంది. గతంలో కనీస వసతుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు ఇప్పుడు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అయితే స్టేషన్ ఆధునికీకరణతో పాటు కొన్ని సమస్యలను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించి ప్లాట్‌ఫాంల మధ్య వెళ్లేటప్పుడు కొంత ఇబ్బంది ఎదురవుతోందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా స్టేషన్ ఆవరణలో కోతుల సంచారం అధికంగా ఉండటంతో ప్రయాణికులు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదను నివారించేందుకు రైల్వే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మొత్తంగా రూ.25 కోట్లతో ఆధునికీకరించిన జనగామ రైల్వేస్టేషన్ ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందించే దిశగా ముందడుగు వేయగా.. మిగిలిన సమస్యల పరిష్కారంతో ప్రయాణ అనుభవం మరింత మెరుగుపడనుంది.

కృష్ణానదిలో మల్లేశ్వరం ద్వీపం

మహబూబ్ నగర్ : నల్లమల అటవీ అందాలు, కృష్ణానది పరవళ్లు, ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కొల్లాపూర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. సోమశిల, మల్లేశ్వరం ప్రాంతాల్లో రూ.57.63 కోట్లతో పనులు చేపట్టారు. సోమశిల ఆలయంలో రూ.6 కోట్లతో వసతి, క్యాంటీన్, పిల్లల ఆటస్థలం ఏర్పాటు చేస్తున్నారు. మల్లేశ్వరం ద్వీపంలో రూ.47.44 కోట్లతో 30 కాటేజీలు, స్పా, వాచ్‌టవర్, బోటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. బోటింగ్ పనులు పూర్తికాగా, ఇతర పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.చుట్టూ పచ్చని నల్లమల అటవీ ప్రాంతం.. చెంతనే పరవళ్లు తొక్కే కృష్ణానది.. ఒకేచోట ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం.. ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక వైభవం కలగలిసిన కొల్లాపూర్ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. తెలంగాణలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల, పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం ప్రాంతాల్లో సుమారు రూ.57.63 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఆర్నెల్లుగా కొనసాగుతున్న ఈ పనులు పూర్తయితే పర్యాటకులకు బస, బోటింగ్, వినోదం, ఆధ్యాత్మిక సందర్శన వంటి అనేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.కొల్లాపూర్ మండలంలోని సోమశిల శ్రీలలితా సోమేశ్వర ఆలయం ఈ ప్రాంతానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ ఆలయంలోనే ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకునే అవకాశం ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నాలుగు డార్మిటరీ గదులు, ప్రసాద పంపిణీ కేంద్రం, క్యాంటీన్, చిన్నపిల్లల కోసం ఆటస్థలం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న పనులు సుమారు 50 శాతం పూర్తయ్యాయి. వీటితో కుటుంబ సమేతంగా వచ్చే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు కలగనున్నాయి.మరోవైపు పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం వద్ద కృష్ణానదిలో ఉన్న ద్వీపాన్ని ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.47.44 కోట్లు మంజూరు చేసింది. ద్వీపం ప్రకృతి అందాలను ఆస్వాదించేలా 30 కాటేజీలు, స్పా



ఏరియా, వాచ్‌టవర్, బోటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. నదీ జలాల మధ్య ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకునే పర్యాటకులకు ఈ ప్రాంతం ప్రత్యేక అనుభూతిని అందించనుంది. ప్రస్తుతం ఐలాండ్ అభివృద్ధి పనులు సుమారు 30 శాతం పూర్తయ్యాయి. జూన్ నాటికి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పర్యాటకశాఖ ఏఈఈ తెలిపారు.సోమశిలకు వచ్చే పర్యాటకులకు బోటింగ్ ప్రధాన ఆకర్షణగా ఉంది. కృష్ణానదిలో పడవ ప్రయాణం ద్వారా నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించే అవకాశం ఉండటంతో పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వీఐపీ పుష్కరఘాట్ వద్ద రూ.1.69 కోట్లతో బోటింగ్ సంబంధిత పనులను పూర్తి చేశారు. అదనంగా రూ.2.50 కోట్లతో బోటింగ్ షెడ్డు నిర్మించాల్సి ఉంది. ఘాట్ వద్ద పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తే పడవ ప్రయాణం మరింత సులభతరం కానుంది. ప్రస్తుతం పుష్కరఘాట్ అభివృద్ధి పనులు 40 శాతం పూర్తయ్యాయి.మొత్తంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన రూ.57.63 కోట్ల పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం రూ.10.19 కోట్లు కేటాయించింది. సోమశిల, మల్లేశ్వరం ప్రాంతాల్లో వివిధ పనులను దశలవారీగా చేపడుతున్నారు. ఇప్పటివరకు బోటింగ్ పనులు పూర్తికాగా.. ఆలయ అభివృద్ధి పనులు సగం, పుష్కరఘాట్ పనులు 40 శాతం, మల్లేశ్వరం ఐలాండ్ పనులు 30 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, నదీ విహారం, ద్వీప పర్యాటకం ఒకేచోట ఉండటం కొల్లాపూర్ ప్రత్యేకత. సోమశిల ఆలయ దర్శనంతో పాటు మల్లేశ్వరం ద్వీపంలో బస, బోటింగ్, నల్లమల ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టులు పూర్తయితే నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కొల్లాపూర్ మరో ఆకర్షణీయమైన విహార గమ్యస్థానంగా మారనుంది.

జూబ్లీహిల్స్, తార్నాకల్లో
మితిమీరుతున్న శబ్ద కాలుష్యం

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో శబ్ద కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, చివరకు నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన జోన్లలోనూ అనుమతించిన పరిమితులకు మించి శబ్దాలు నమోదవుతున్నాయి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి 2026 జనవరి నుంచి జులై వరకు సేకరించిన గణాంకాలు ఈ పరిస్థితిని వెల్లడిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో పగలు, రాత్రి వేళల్లోనూ శబ్ద స్థాయిలు నిర్దేశిత ప్రమాణాలను దాటుతున్నాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, తార్నాకలోని నివాస ప్రాంతాల్లో పర్యవేక్షణ జరిగిన కాలమంతా అనుమతించిన స్థాయికి మించి శబ్ద కాలుష్యం నమోదైంది. వాణిజ్య ప్రాంతమైన జేఎన్‌టీయూలోనూ ఇదే పరిస్థితి కొనసాగగా.. అబిడ్స్‌లో పలు నెలలపాటు రాత్రి వేళల్లో పరిమితులు ఉల్లంఘించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. నగరంలో శబ్ద కాలుష్యానికి వాహనాల రాకపోకలు, అనవసర హారన్ల మోత ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. అధిక శబ్దంతో మోగించే డీజేలు, నిర్మాణ పనులు, ఫంక్షన్ హాళ్లలో జరిగే కార్యక్రమాలు కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. రోడ్డు భద్రత కార్యకర్త అరుణ్ బతులా తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితికి ముందు ఆయన ట్రాఫిక్ పోలీసులతో కలిసి సచివాలయం సమీపంలోని తెలంగాణ తల్లి కూడలిలో గంటపాటు శబ్ద స్థాయిలను పరిశీలించారు. ఆ సమయంలో 82 నుంచి 110 డెసిబెల్స్ వరకు శబ్దం నమోదైంది. నిరంతరం వినిపించే హారన్లను ఎలా భరిస్తున్నారని అక్కడి సిబ్బందిని అడిగితే, ఆ శబ్దాలకు అలవాటు పడిపోయామని కొందరు చెప్పినట్లు ఆయన వివరించారు. మరికొందరు నిద్రలోనూ హారన్ల శబ్దాలు వినిపిస్తున్నాయని చెప్పడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అనవసరంగా హారన్లు మోగించకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ తెలిపారు. హెచ్‌సీఎస్‌సీ వాలంటీర్ల సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అదనపు మఫ్టీ హారన్లు అమర్చిన వాహనాలపై క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, హారన్లే శబ్ద కాలుష్యానికి ప్రధాన కారణమని, శివారు ప్రాంతాల్లో నిర్మాణ పనుల వల్ల శబ్దం ఎక్కువగా ఉంటోందని వివరించారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై
కాంగ్రెస్ కసరత్తు.. రేసులో ఉన్నది వీరే!

హైదరాబాద్ : తెలంగాణలో నవంబర్ 14తో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సందడి మొదలైంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని మూడు స్థానాలను భర్తీ చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలువురు నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల సందడి మొదలైంది. నవంబర్ 14తో ఖాళీ కానున్న మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన నేతలు ఇప్పుడు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి కేటాయించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ రేసులో దొమ్మాటి సాంబయ్య, నాగరిగారి ప్రీతమ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, చారుకొండ వెంకటేష్, కూడా తమ ప్రయత్నాలు చేస్తున్నారు.ఇక ఓసీ కోటాలో బ్రాహ్మణ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వర్గం నుంచి హార్కర వేణుగోపాల్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా.. దయాసాగర్ పేరు కూడా చర్చలో ఉంది.మరోవైపు బీసీ సామాజికవర్గం నుంచి భారీగా ఆశావహులు ఉన్నారు. పద్మశాలి వర్గానికి అవకాశం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈ రేసులో ఈరవత్రి అనిల్, కైలాష్ నేత, సంగీశెట్టి జగదీశ్వర్, జక్కని అనితతో పాటు మరికొందరి పేర్లు వినిపిస్తున్నాయి. యాదవ సామాజికవర్గం నుంచి చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, లింగం యాదవ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. మహిళా ప్రాతినిధ్యం కోణంలో సునీత రావు పేరు వినిపిస్తోంది.మొత్తంగా మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీలో సామాజిక సమీకరణాలే కీలకం కానున్నాయి. పదవులు దక్కని నేతలకు ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం కల్పించే అంశం కూడా చర్చకు వస్తోంది. అయితే చివరకు కాంగ్రెస్ అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందనేది ఉత్కంఠగా మారింది



సిటీ మధ్యలో రియల్ జోరు

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. అయితే ఒకప్పుడు రియల్ ఎస్టేట్‌కు కేంద్ర బిందువైన సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ జోరు కనబరుస్తోంది. పూర్వ వైభం దిశగా వడి వడిగా అడుగులు వేస్తోంది. పాత ఇళ్ల స్థానంలో కొత్త ఆకాశ హర్మ్యాలు వెలుస్తున్నాయి. ఆకాశాన్ని తాకేలా భవనాలతో అందరి చూపుని ఆకర్షిస్తోంది.దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. నగరం నలుమూలల విస్తరిస్తూ మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షిస్తోంది. అయితే, ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య, నివాస, ఉపాధి కేంద్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ ఫోకస్‌లోకి వచ్చింది. మళ్లీ పూర్వ వైభవం దిశాగా అడుగులు వేస్తోంది. బషీర్‌బాగ్, సైఫాబాద్ వంటి ప్రాంతాల్లో ఆకాశ హర్మ్యాలు వెలిశాయి. ఎత్తయిన రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ భవనాలు నిర్మితమవుతున్నాయి. బేగంపేట విమానాశ్రయం తరలింపు, ట్రాఫిక్ సమస్యల వంటి వివిధ కారణాలతో ఈ ప్రాంతం శోభ తగ్గినా.. ప్రస్తుతం పాత భవనాల పునర్నిర్మాణం, పరిశ్రమల భూముల వినియోగంలో మార్పుల ద్వారా సరికొత్త రియల్ ఎస్టేట్ రంగును సంతరించుకుంటోంది. లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు జోరందుకుంటున్నాయి.నగరంలోని కోర్ సిటీలో ఖాళీ స్థలాల లభ్యత దాదాపు శూన్యం కావడంతో డెవలపర్లు రీ-డెవలప్‌మెంట్ నమూనాపై దృష్టి సారించారు. ఒకప్పుడు ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న పరిశ్రమలను బయటకు తరలించే క్రమంలో, ప్రభుత్వం ఆ భూముల కేటగిరీని నివాస ప్రాజెక్టులకు మార్చడంతో భారీ ప్రాజెక్టులకు మార్గం సుగమమైంది. పాత ఐదంతస్తుల భవనాలు, ఫ్యాక్టరీలు, స్టూడియోలను కూల్చివేసి వాటి స్థానంలో 20 నుంచి 50 అంతస్తుల భారీ నివాస కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నారు. పంజాగుట్ట, బేగంపేట, అబిడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, సోమాజిగూడ, కవాడిగూడ, వీఎస్‌టీ, గోల్కొండ చౌరస్తాలలో భారీ హైరైజ్ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి.ఐటీ కారిడార్‌తో పోలిస్తే సెంట్రల్ హైదరాబాద్‌కు ఉన్న మౌలిక సదుపాయాలే దీని పునరుజ్జీవనానికి ప్రధాన కారణం. బస్సు, ఎంఎంటీఎస్ రైలు, మెట్రో కనెక్టివిటీ అందుబాటులో ఉండడం ప్లస్ పాయింట్. కేవలం 20 నుంచి 30 నిమిషాల్లో ప్రైవేట్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా గచ్చిబౌలి, హైటెక్ సిటీలకు చేరుకునే సౌలభ్యం ఉంది. నగరంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలు, కార్పొరేట్ హాస్పిటళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, హుస్సేన్ సాగర్ వంటి పర్యాటక ప్రాంతాలు సమీపంలోనే ఉన్నాయి.తరతరాలుగా సెంట్రల్ హైదరాబాద్‌లోనే నివసిస్తున్న వ్యాపారవేత్తలు, ఉద్యోగుల కుటుంబాలు తమ నివాసాలను నూతన జీవనశైలికి తగ్గట్టుగా అప్ గ్రేడ్ చేసుకోవాలని కోరుకుంటున్నారు. ఇన్నాళ్లూ సెంట్రల్ హైదరాబాద్‌లో లగ్జరీ అపార్ట్‌మెంట్లు లేక ఐటీ కారిడార్ వైపు వెళ్లిన వారు, ఇప్పుడు కోర్ సిటీలోనే అందుబాటులోకి వస్తున్న ఆధునిక ప్రాజెక్టులను ఎంచుకుంటున్నారు. కొరత, ప్రీమియం లొకేషన్ కారణంగా సెంట్రల్ హైదరాబాద్‌లో వస్తున్న ప్రాజెక్టులలో ప్లాట్ల, ప్రారంభ ధర రూ.1 కోటికి పైనే పలుకుతోందని రియల్టర్లు పేర్కొంటున్నారు.

పలు హోటళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

హైదరాబాద్ : భాగ్యనగరంలో బిర్యానీ, చాయ్, రుచికరమైన వంటకాల కోసం నిత్యం వేలాది మంది క్యూ కట్టే ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్ల అసలు బండారం ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడుల్లో బట్టబయలైంది. టీజీ సేఫ్ విభాగం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 22 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గోల్కొండ, చార్మినార్ జోన్లలో ఏకకాలంలో భారీ తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో నగరంలో అత్యంత పేరుగాంచిన షాగౌస్, హోటల్ నయాబ్, మెహఫిల్, సొహైల్ వంటి రెస్టారెంట్ల వంటగదుల్లో కనిపించిన దృశ్యాలు అధికారులనే నివ్వెరపరిచాయి.ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి తీవ్రమైన అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన మొత్తం 14 ప్రముఖ రెస్టారెంట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను అధికారులు తక్షణమే సస్పెండ్ చేస్తూ, వాటి కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల సందర్భంగా ప్రముఖ హోటళ్ల వంటగదుల్లో వెలుగుచూసిన పరిస్థితులు భయానకంగా ఉన్నాయి. కుళ్ళిపోయిన కూరగాయలు, ఫంగస్ పట్టిన ఆహార పదార్థాలు, ఎక్స్‌పైరీ అయిపోయిన సరుకులను యథేచ్ఛగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పచ్చి మాంసాన్ని, శాకాహార వంటకాలను నిబంధనలకు విరుద్ధంగా ఒకేచోట నిల్వ ఉంచడం, ఒకసారి వాడిన నూనెనే మళ్లీ మళ్లీ మరిగిస్తూ వంటలు చేస్తుండటం బయటపడింది.అన్నింటికంటే దారుణంగా.. వంటగదుల్లో ఎలుక రెట్టలు, బొద్దింకలు, ఈగలు స్వైరవిహారం చేస్తుండగా, కొన్నిచోట్ల కిచెన్లలో పిల్లులు తిరుగుతున్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. మురుగునీటి నిల్వలు, గ్రీజుతో పేరుకుపోయిన చిమ్నీలు, చితికిపోయిన ఫ్లోరింగ్ నడుమ.. సిబ్బంది కనీసం ఆప్రాన్లు, హెయిర్‌నెట్స్ కూడా ధరించకుండా ఆహారాన్ని తయారు చేస్తున్నారు.లైసెన్సులు రద్దయిన 14 రెస్టారెంట్లలో శాలిబండలోని షాగౌస్ కేఫ్, నయాపూల్ హోటల్ నయాబ్, సంతోష్‌నగర్ లక్కీ రెస్టారెంట్, దిల్?సుఖ్?నగర్ మెహఫిల్, మలక్‌పేట్ సొహైల్ రెస్టారెంట్‌లతో పాటు టోలిచౌకి, సంతోష్ నగర్‌లలోని శ్రీ రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటళ్లు, గుడిమల్కాపూర్‌లోని శ్రీ బాలాజీ ఫ్యామిలీ ధాబా, సిద్దిఖ్ కబాబ్ సెంట్రల్ కిచెన్, టోలిచౌకి అల్సుబా, మాసబ్ ట్యాంక్ డైన్ హిల్, ఎంజేఆర్ రోడ్డులోని అక్షయ టిఫిన్స్, వెంకటేశ్వర హోటల్, రేతిబౌలిలోని అజీబో రాయల్ అరేబియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవన్నీ తక్షణమే తమ కార్యకలాపాలను నిలిపివేయాల్సిందేనని అధికారులు తేల్చిచెప్పారు.అలాగే, ఇంజిన్ బౌలిలోని ప్రతిష్టాత్మక తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, శాలిబండ పిస్తా హౌస్, చార్మినార్‌లోని హోటల్ సబ్జీ, మండి ఎట్ 36 అరేబియన్ కిచెన్, సంతోష్‌నగర్ స్వీకార్ హోటల్, మాసబ్ ట్యాంక్ గోల్కొండ హోటల్ అండ్ రిసార్ట్స్, టోలిచౌకి ఇంపీరియల్ మల్టీక్యూసిన్ రెస్టారెంట్, బజార్‌ఘాట్ తైబా బేకరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరారు.

బిజినెస్

దిగివచ్చిన ముడిచమురు ధరలు..
ఏకంగా వెయ్యికిపైగా
పాయింట్ల లాభంతో సెన్సెక్స్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధాన్ని ముగించేందుకు చర్చలు జరుగుతున్నాయన్న వార్తలతో ముడిచమురు ధరలు దిగివచ్చాయి. దాంతో సూచీలు భారీ లాభాల్లో దూసుకుపోతున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 1000 పాయింట్లకుపైగా ఎగబాకింది. ఉదయం 11.10 గంటల సమయంలో సెన్సెక్స్ 989 పాయింట్ల లాభంతో 75,488 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 289 పాయింట్లు పెరిగి 23,305 వద్ద కదలాడుతున్నది. నిఫ్టీ సూచీలో రిలయన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, టాటా స్టీల్, జియో ఫైనాన్షియల్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ఉండగా సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్, ఐషర్ మోటార్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ షేర్‌లు నష్టపోతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.97 వద్ద ప్రారంభమైంది. త్రైమాసిక ఫలితాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.29,550 కోట్ల రికార్డు నికర లాభాన్ని నమోదుచేసింది. ఈ ఫలితాలు మదుపర్లను మెప్పించాయి. దాంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ 6 శాతానికిపైగా ఎగబాకింది. కంపెనీల బలమైన ఫలితాలు ప్రధాన సూచీల ర్యాలీకి కారణమయ్యాయి. మరోవైపు బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు 110 డాలర్లకు దిగివచ్చింది. గతవారం ఆరునెలల గరిష్ఠస్థాయి అయిన 118 డాలర్లను తాకింది. ఇప్పుడు 8 డాలర్‌లు వెనక్కి తగ్గింది.

గ్రోక్ ఏఐ ఖర్చులు భరించలేకపోతున్నా: మస్క్



ఉత్పాదకతను పెంచుకునే లక్ష్యంతో పలు కంపెనీలు ఏఐ వినియోగం వైపు మొగ్గుచూపుతున్నాయి. అయితే.. ఏఐ కారణంగా ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో.. వాటిని తగ్గించుకోవడానికి కొత్త మార్గాల ను అన్వేషిస్తున్నాయి. తాజాగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎక్స్' సామాజిక మాధ్యమంలోని 'గ్రోక్' ఏఐ చాట్‌బాట్‌ను నిర్వహించడానికి తన కంపెనీకి భారీ మొత్తంలో డబ్బు ఖర్చవుతోందని పేర్కొన్నారు. వచ్చే ఆదాయంతో పోలిస్తే.. ఖర్చులే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎక్స్ (శ) లోని పలువురు ప్రీమియం వినియోగదారులు.. తమ వారపు గ్రోక్ బాట్ వినియోగ కోటాలు వేగంగా అయిపోతున్నాయని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఓ మాజీ యూజర్ స్పందిస్తూ.. గ్రోక్ బాట్ వినియోగ పరిమితులను రీసెట్ చేయాలని కోరుతూ మస్క్‌ను ట్యాగ్ చేశారు. దీనిపై స్పందిస్తూ మస్క్ పై వ్యాఖ్యలు చేశారు. సర్వర్ ఖర్చులు మరింత పెరగకుండా నిరోధించడానికి, కంపెనీ కఠినమైన వినియోగ పరిమితులను అమలు చేస్తోందని వెల్లడించారు. ఏఐపై అమెరికాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ కంపెనీలు చేసిన మొత్తం అప్పు రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ కంపెనీల మొత్తం అప్పు 2026 మధ్య నాటికి దాదాపు 45 శాతం పెరిగి 578 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.54లక్షల కోట్లు)కు చేరుకున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా ఉన్నాయి.

ఆటో అమ్మకాల పండగ..
అక్టోబర్‌లో 5 లక్షలు!

పండుగ సీజన్ కలిసి రావడంతో అక్టోబర్‌లో దేశీయ ప్యాసింజర్ వాహనాల హోల్‌సేల్ విక్రయాలు రికార్డు స్థాయిలో 5 లక్షల యూనిట్ల మార్కును దాటాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి దిగ్గజ వాహన సంస్థలు తమ చరిత్రలోనే అత్యధిక నెలవారీ విక్రయాలను నమోదు చేశాయి. ఈ ఏడాది (2026) అక్టోబర్‌లో 5.25 లక్షల నుంచి 5.30 లక్షల మధ్య ప్యాసింజర్ వాహనాలు అమ్ముడై ఉండవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గతేడాది ఇదే అక్టోబర్‌లో నమోదైన 4.60 లక్షల యూనిట్లతో పోలిస్తే, ఈసారి వార్షిక ప్రాతిపదికన విక్రయాల వృద్ధి 13 నుంచి 15 శాతంగా ఉంటుందని భావిస్తున్నారు. మొబిలిటీ గ్లోబల్ లైట్ వెహికల్



ప్రొడక్షన్ ఫోర్‌కాస్టింగ్ అసోసియేట్ డైరెక్టర్ గౌరవ్ వంగాళ్ మాట్లాడుతూ.. "నవంబర్ మొదటి వారంలోనే ధనత్రయోదశి, దీపావళి పండుగలు ఉండటంతో.. డిమాండ్‌కు తగ్గట్లుగా వాహనాలను అందించేందుకు ఆటో కంపెనీలు అక్టోబర్‌లోనే డీలర్లకు భారీగా స్టాక్‌ను పంపాయి. దీంతో అక్టోబర్ హోల్‌సేల్స్ గణనీయంగా పెరిగాయి. అయితే, కస్టమర్లు వాహనాలను డెలివరీ తీసుకునే ప్రక్రియ ప్రధానంగా నవంబర్‌లోనే జరగనుంది. గతేడాది పండుగ సీజన్‌తో పోలిస్తే అక్టోబర్ వాహన రిజిస్ట్రేషన్లు (రిటైల్స్) కొంత తగ్గే అవకాశమున్నప్పటికీ, నవంబర్‌లో ఇవి మరింత పుంజుకుంటాయి" అని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో దేశీయ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే 28.3 శాతం పెరిగి 20.55 లక్షల యూనిట్లకు చేరాయి.

పొదుపే శ్రీరామరక్ష.. అప్పుల ఊబిలో పడకుండా ఉండేందుకు ఈ పొదుపు అలవాట్లు మొదలుపెట్టండి!

ఓవైపు వాతావరణ మార్పులు, మరోవైపు మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు.. సగటు మనిషి జీవనాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయి. మానవ తప్పిదాలతో కొన్ని, ప్రకృతి ప్రకోపాలతో మరికొన్ని.. ధరల పెరుగుదలకు, ఆదాయం తరుగుదలకు దారితీస్తున్నాయి. మరి.. ప్రస్తుత కరువును, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణ పరిస్థితులను అధిగమించడం ఎలా? నిపుణులు ఏం చెప్తున్నారు? కృత్రిమ మేధస్సు (ఏఐ) అన్ని రంగాల్లో వేగంగా విస్తరిస్తున్నది. ఏఐకి పెద్దపీట వేస్తున్న కంపెనీల యాజమాన్యాలు.. మానవ శక్తిని క్రమేణా తగ్గించుకుంటున్నాయి. ఫలితంగా ఉద్యోగ కోతలు పెరుగుతున్నాయి. ఎప్పుడు ఎవరి ఉద్యోగం ఊడుతుందో తెలియని దుస్థితి నెలకొన్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అందుకే కొత్తగా వస్తున్న నైపుణ్యాలను యువత అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉన్నదని మెజారిటీ పర్సనల్ ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో జాబ్ సెక్యూరిటీ ఉంటుందని గుర్తుచేస్తున్నారు. ఇటీవలికాలంలో చాలామంది తమ కెరియర్ ఒడిదుడుకులతో దూరమైన ఆదాయాన్ని రుణాలతో భర్తీచేసి అవసరాలను తీర్చుకోవడం కనిపిస్తున్నది. కానీ ఈ రకమైన తీరు పీకల్లోతు అప్పుల ఊబిలోకి నెట్టగలదు. అలాగే క్రెడిట్ కార్డ్ ఆఫర్ల జోలికి వెళ్లవద్దు. చెల్లింపులు భారంగా మారే ప్రమాదం ఉన్నది. చేతిలో నగదు ఉంటే అనవసరమైన రుణాలను తీర్చేసుకోవడం మంచిది. ముఖ్యంగా ఈఎంఐలలో కొనేందుకు ఆసక్తి చూపవద్దు. ఇది దుబారాకు దారితీయగలదు. వాహన, గృహ కొనుగోళ్లను ఇప్పటికైతే



వాయిదా వేసుకోవడమే మంచిది. లోన్లపై ఆధారపడి అస్సలు కొనవద్దు. పర్సనల్ లోన్లకూ దూరంగానే ఉండండి.

పండుగ సీజన్‌తో జాగ్రత్త

ప్రస్తుతం పండుగ సీజన్ నడుస్తున్నది. ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో ఎక్కడ చూసినా ఆఫర్లే కనిపిస్తున్నాయి. కనుక ఎదైనా కొనాలనిపిస్తే.. అది మీకు ఎంతవరకు ఉపయోగపడుతుంది అనేది ముందుగా ఆలోచించడం ఉత్తమం. లేకుంటే మీ కొనుగోళ్లు మరిన్ని వృథా ఖర్చులకు కారణం కాగలవు. ఉన్నదాంట్లో సర్దుకుపోయి.. అత్యవసరమైతే తప్ప కొత్త వాటి జోలికి వెళ్లకపోవడమే తెలివైన నిర్ణయం. అలాగే ప్రతి చిన్న అవసరం కోసం సూపర్ మార్కెట్ల వైపు పరుగులు తీయకండి. ఇంటి దగ్గర్లోని కిరాణా దుకాణాలకు వెళ్తే పొదుపుగా కావాల్సింది మాత్రమే కొనుక్కోవచ్చు. ఇక వీలుంటే ప్రజా రవాణా సదుపాయాలనే (బస్సులు, రైళ్లు, మెట్రో సర్వీసులు) వాడుకోవాలి. వర్షాభావ పరిస్థితులతో ఆహారోత్పత్తుల రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఆహారాన్ని వృథా చేయవద్దు.

చివరగా..

అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో మిడిల్ ఈస్ట్‌లో ఏర్పడిన ఉద్రిక్తతలు.. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్ని పరుగులు పెట్టిస్తున్నాయి. దాదాపు 90 శాతం చమురు దిగుమతులపైనే ఆధారపడ్డ భారత్‌లో.. పెరుగుతున్న క్రూడాయిల్ రేట్లు అనేక సవాళ్లు, ఒత్తిళ్లకు కారణమవుతున్నాయి. అధిక పెట్రోల్, డీజిల్ ధరలతో రవాణా ఖర్చులు భారమై అన్ని వస్తూత్పత్తులు ప్రియమవుతున్నాయి. దీంతో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచుతున్నది చూస్తూనే ఉన్నాం. ఇది వ్యాపార, పారిశ్రామిక రంగాలకు నిధుల కొరతను సృష్టిస్తున్నది. అంతిమంగా దేశ ఆర్థిక ప్రగతికి బ్రేకులు పడుతున్నాయి.

స్పోర్ట్స్

దిగ్గజ జట్లకు షాక్..
వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సంచలనం

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన ఆఫ్ఘనిస్థాన్

తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు

శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్ వంటి జట్లను వెనక్కి నెట్టిన వైనం

వన్డే, టీ20 ప్రపంచకప్‌లలో అద్భుత ప్రదర్శనలతో సత్తా చాటిన ఆఫ్ఘన్

ఇటీవల ఐర్లాండ్, జింబాబ్వే సిరీస్‌లలో క్లీన్‌స్వీప్‌లతో జోరు



అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో జింబాబ్వేను కేవలం 79 పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ మ్యాచ్‌లో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ 13 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. ఈ సిరీస్‌లోని రెండో టీ20లో అజ్మతుల్లా ఒమర్జాయ్ కేవలం 50 బంతుల్లో 116 పరుగులు చేయగా, తొలి మ్యాచ్‌లో కెప్టెన్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ఈ వరుస విజయాలు, నిలకడైన ప్రదర్శనతో ఆఫ్ఘనిస్థాన్ ప్రపంచ క్రికెట్‌లో ఒక బలమైన జట్టుగా ఎదుగుతోంది.

న్యూజిలాండ్ వీధుల్లో సామాన్యుల్లా భారత క్రికెటర్లు



భారత క్రికెట్ స్టార్లకు స్వదేశంలో ఉండే ఆదరణ, అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వారు బయటకు వస్తే చాలు, అభిమానులు చుట్టుముడతారు. అయితే, విదేశీ పర్యటనల్లో మాత్రం వారికి పూర్తి భిన్నమైన అనుభవం ఎదురవుతుంది. తాజాగా టీమిండియా ఆటగాళ్లు రోహిత్ శర్మ, కుల్దీప్ యాదవ్ విషయంలో ఇదే జరిగింది. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు రోహిత్ శర్మ, కుల్దీప్ ఆక్లాండ్ వీధుల్లో సరదాగా షికారు చేస్తూ కనిపించారు. సాధారణ దుస్తుల్లో సెక్యూరిటీ సిబ్బందితో కలిసి మాట్లాడుకుంటూ నడుస్తున్న వీరిని స్థానికులు ఎవరూ గుర్తుపట్టినట్లు కనిపించలేదు. ఎలాంటి హడావుడి లేకుండా, పూర్తి స్వేచ్ఛగా వారు తమ సమయాన్ని ఆస్వాదించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన అభిమానులు.. విదేశాల్లో భారత క్రికెటర్లకు లభించే ప్రశాంతత, వ్యక్తిగత స్వేచ్ఛపై చర్చించుకుంటున్నారు. కాగా, ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం రోహిత్ శర్మ గత వారమే న్యూజిలాండ్ చేరుకున్నాడు. ఇక కుల్దీప్ యాదవ్ ఇప్పటికే అక్కడ ముగిసిన టీ20 సిరీస్‌లో జట్టులో ఉన్నప్పటికీ, ఆడే అవకాశం రాలేదు. కనీసం వన్డే సిరీస్‌లోనైనా తుది జట్టులో చోటు దక్కించుకోవాలని ఆశిస్తున్నాడు.

రోహిత్ వర్సెస్ కోహ్లీ..
ఎవరు సెంచరీ చేస్తారు? పుజారా అంచనా ఇదే!

కోహ్లీకి సెంచరీ అవకాశాలు ఎక్కువన్న పుజారా

మూడో స్థానంలో బ్యాటింగ్ కోహ్లీకి కలిసొస్తుందని వ్యాఖ్య

న్యూజిలాండ్‌లో రోహిత్ పాత్ర మారొచ్చని అంచనా

ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని జోస్యం

న్యూజిలాండ్‌కు స్వల్ప ఆధిక్యం ఉంటుందని అభిప్రాయం



న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ కంటే విరాట్ కోహ్లీకి సెంచరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారా అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో కోహ్లీ మూడో స్థానంలో రావడం అతడికి ఇన్నింగ్స్‌ను నిర్మించుకునే అవకాశం కల్పిస్తుందని చెప్పాడు. అదే సమయంలో ఓపెనర్‌గా రోహిత్ పవర్‌ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుందని, న్యూజిలాండ్ పిచ్‌లపై అతడి పాత్రలో మార్పు ఉండొచ్చని పేర్కొన్నాడు. జియోస్టార్‌తో మాట్లాడిన పుజారా.. "రోహిత్ సాధారణంగా పవర్‌ప్లేలో జట్టుకు మంచి ఆరంభం అందించడంపై దృష్టి పెడతాడు. న్యూజిలాండ్ పరిస్థితుల్లో అతడి పాత్ర మారవచ్చు. అయితే కోహ్లీ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. ఇన్నింగ్స్‌ను నిలబెట్టి ఆడటం అతడి ఆటతీరులో కీలకం. ఈ స్థానంలో వచ్చే బ్యాటర్‌కు వన్డేల్లో సెంచరీ చేసే అవకాశం కొంత ఎక్కువగా ఉంటుంది. అందుకే రోహిత్ కంటే కోహ్లీకి శతకం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నా" అని వివరించాడు. ఈ సిరీస్ హోరాహోరీగా సాగుతుందని పుజారా అంచనా వేశాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగుస్తుందని, వర్షం కారణంగా ఓ మ్యాచ్ రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆడే భారత జట్టు, చివరి రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగే జట్టు వేరుగా ఉండనుండటం న్యూజిలాండ్‌కు కొంత అనుకూలిస్తుందని అభిప్రాయపడ్డాడు. అయితే తొలి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టు మెరుగ్గా రాణిస్తుందని పుజారా విశ్వాసం వ్యక్తం చేశాడు. చివరి రెండు మ్యాచ్‌లు టీమిండియాకు కొంత సవాలుగా మారవచ్చని అన్నాడు. న్యూజిలాండ్‌లో వర్షాలు కూడా మ్యాచ్‌ల ఫలితాలపై ప్రభావం చూపవచ్చని పేర్కొన్నాడు.

ఆదర్శ కుటుంబానికి రూ.75 కోట్లు
వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం' బ్లాక్‌బస్టర్ !

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఆదర్శ కుటుంబం' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి వారాంతంలోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా చిత్ర బృందం 'బ్లాక్‌బస్టర్' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో వెంకటేశ్ అభిమానులు, చిత్ర బృందం ఈ విజయాన్ని ఆనందంగా జరుపుకుంటున్నారు. చాలా కాలం తర్వాత వెంకటేశ్, త్రివిక్రమ్ కలిసి పనిచేయడంతో ఈ సినిమాపై మొదటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా శ్రీనిధి శెట్టి నటించారు. నివేదా పేతురాజ్, రావు రమేశ్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని చిత్ర బృందం ప్రకటించింది. తొలి వారాంతానికే ప్రపంచవ్యాప్తంగా రూ.75 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం సినిమాకు లభిస్తున్న ఆదరణను తెలియజేస్తోంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని నిర్మాతలు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో 'బ్లాక్‌బస్టర్' అని ప్రకటిస్తూ వసూళ్ల వివరాలను వెల్లడించారు. విదేశీ మార్కెట్‌లోనూ 'ఆదర్శ కుటుంబం'కు మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా అమెరికాలో ఈ సినిమా ఇప్పటికే 10 లక్షల డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. మరోవైపు దేశీయంగా ప్రముఖ టికెట్ బుకింగ్ వేదిక బుక్‌మైషోలోనే 10 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ లెక్కలు సినిమాకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణను తెలియజేస్తున్నాయి. తొలి వారాంతంలో మంచి వసూళ్లు సాధించినప్పటికీ, సోమవారం నుంచి సినిమా వసూళ్లు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. సాధారణంగా వీకెండ్ హాలీడేస్‌లో థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అయితే వీక్ డేస్‌లోను అదే స్థాయిలో ప్రేక్షకులను ఆకర్షించగలిగితే సినిమా వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కుటుంబ ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని రూపొందిన ఈ చిత్రానికి వచ్చే రోజుల్లో ఎలాంటి ఆదరణ లభిస్తుందో చూడాలి. తొలి వారాంతంలో రూ.75 కోట్ల మార్కును అందుకున్న 'ఆదర్శ కుటుంబం' వసూళ్లు మరింత పెరిగి కొత్త రికార్డులు సృష్టిస్తాయా? అనేది ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



ప్రేమలో దారుణంగా మోసపోయానంటున్న హీరోయిన్ రెజీనా



గ్లామరస్ పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్నమైన కథలు, పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కసాండ్రా. కథానాయికగా మాత్రమే కాకుండా ప్రతినాయిక ఛాయలున్న పాత్రల్లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' సినిమాలో కీలకమైన ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో ఈ చిత్రం 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న రెజీనా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గతంలో ప్రేమలో ఎదురైన చేదు అనుభవం తనను ఎంతగా కుంగదీసిందో వివరించారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ.. 2020లో తన జీవితంలో ఊహించని సంఘటన చోటుచేసుకుందని రెజీనా వెల్లడించారు. ప్రేమ బంధం అర్ధాంతరంగా ముగియడంతో పాటు, ఆ సంబంధంలో తాను తీవ్రంగా మోసపోయానని చెప్పారు. ఆ పరిణామం తనపై తీవ్ర మానసిక ప్రభావం చూపిందని, కొంతకాలం డిప్రెషన్‌తో బాధపడ్డానని తెలిపారు. ఆ బాధ నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని, ఆ అనుభవం తర్వాత కొంతకాలం ఎలాంటి కొత్త ప్రేమ బంధంలోకి వెళ్లకూడదని నిర్ణయించుకున్నానని రెజీనా పేర్కొన్నారు. ఆ సమయంలో ఎదురైన మానసిక సంఘర్షణ తన జీవితాన్ని మరో కోణంలో ఆలోచించేలా చేసిందని వివరించారు. కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో ఉపయోగపడిందని రెజీనా చెప్పారు. ఇతరుల నుంచి ప్రేమ, ఆదరణ, ఓదార్పు ఆశించే ముందు మనల్ని మనం ప్రేమించుకోవడం నేర్చుకోవాలని సూచించారు. ప్రేమలో ఎదురైన వైఫల్యాలే కాకుండా, చాలామంది యువతులు జీవితంలో ఏదో ఒక దశలో లైంగిక వేధింపులు, ఇతర చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. తన స్నేహితులతో మాట్లాడినప్పుడు ఇలాంటి సమస్యలు ఎంత విస్తృతంగా ఉన్నాయో అర్థమైందని తెలిపారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు బాధితులు తమనే తాము నిందించుకోవద్దని రెజీనా సూచించారు. 'నాకే ఎందుకు ఇలా జరిగింది?' అని ఆత్మన్యూనతకు గురికాకుండా, జరిగిన విషయాలను మనసులో దాచుకోకుండా నమ్మకమైన వారితో పంచుకోవాలని చెప్పారు. ధైర్యంగా తమ బాధను బయటపెట్టినప్పుడే ఆ చేదు అనుభవాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఆర్‌సీ17పై మరో ప్రచారం.. గుజరాతీ బ్లాక్‌బస్టర్ రీమేక్ అంటూ రూమర్స్!

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాపై రోజుకో ఆసక్తికరమైన వార్త తెరపైకి వస్తోంది. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు పూర్తికాగా, విడుదలైన ప్రీ లుక్ పోస్టర్ మరింత ఆసక్తిని పెంచింది. అయితే తాజాగా ఈ సినిమా కథపై మరో ప్రచారం మొదలైంది. గుజరాతీలో సంచలనం సృష్టించిన 'లాలో' చిత్రానికి ఇది రీమేక్ అంటూ వార్తలు వైరల్ అయ్యాయి. కానీ ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలుస్తోంది. 'ఆర్‌సీ 17' ప్రీ లుక్ పోస్టర్ విడుదలైనప్పటి నుంచి సినిమా కథపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పోస్టర్‌లో ఉపయోగించిన రంగులు, చిత్రీకరణ శైలి నేపథ్యంలో ఈ సినిమాలో పౌరాణిక అంశాలు ఉండబోతున్నాయని కొందరు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా రామ్ చరణ్ శ్రీకృష్ణుడి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే ఈ విషయాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా, గుజరాతీలో విడుదలై విజయం సాధించిన 'లాలో' (2025) సినిమాను తెలుగులో రామ్ చరణ్‌తో రీమేక్ చేయబోతున్నారంటూ వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ ప్రాజెక్టే సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్‌సీ 17' అని ప్రచారం మొదలైంది. దీంతో అభిమానుల్లోనూ ఆసక్తి పెరిగింది. అయితే ఈ రెండు సినిమాలకు ఎలాంటి సంబంధం లేదని తెలుస్తోంది. సుకుమార్ 2024 మార్చిలోనే రామ్ చరణ్‌తో తన తదుపరి సినిమాను ప్రకటించారు. అప్పటి నుంచే ఈ చిత్ర కథపై ఆయన పని చేస్తున్నారు. 'లాలో' విడుదలకు ముందే 'ఆర్‌సీ 17' కథలోని కీలక భాగాన్ని సుకుమార్ సిద్ధం చేసినట్లు సమాచారం. అందువల్ల ఈ సినిమా గుజరాతీ చిత్రానికి రీమేక్ అనే ప్రచారానికి ఆధారం లేదని స్పష్టమవుతోంది. మరోవైపు 'లాలో' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయబోతున్నారనే వార్తలు కూడా వినిపించాయి. అయితే ఆ రీమేక్‌లో రామ్ చరణ్ నటించడం లేదని, మరో హీరో ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీంతో 'ఆర్‌సీ 17'ను 'లాలో' రీమేక్‌గా పేర్కొంటూ వస్తున్న వార్తలకు తెరపడినట్లయింది.



PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999